Licensed to post without Prepayment No. J/Nellore/003/12-14 R.N.I.No.25359/74 - PLG/NL/9-10/03






# లాయర్

వ్యవస్థాపకులు : తుంగా రాజగోపాలరెడ్డి సంగ్రాహకులు : తుంగా శివప్రభాత్‌రెడ్డి
www.lawyerteluguweekly.com

## తీరంలో తీరని శోకం

- 'అల'కల్లోలం
- కకావికలమైన విశాఖ
- వేలకోట్ల నష్టం... కోలుకోలేని కష్టం

విశాఖ..ఇప్పుడో విషాద నగరంగా మారిపోయింది. హుద్‌హుద్ తుఫాన్ రాకాసి ధాటికి సర్వస్వం కోల్పోయి, వెక్కి వెక్కి ఏడ్చి అలసిపోయి..ఎండిపోయిన కన్నీటిచారికలతో.. బాధాతప్తహృద యంతో కుమిలిపోతోంది. ఈ విల యంతో ఉత్తరాంధ్ర విలవిలలాడుతోంది. తీరంలో తీరని శోకమే మిగిలింది. లక్షలాది మంది ప్రజలు తుఫాన్ ధాటికి అష్టకష్టాలపాలై అల్లాడిపోతున్నారు. తమను ఆదుకునే ఆపన్నహస్తాల కోసం ఎంతో ఆతృతగా ఎదురుచూస్తున్నారు.

ఆదివారం రాత్రి.. విశాఖ ప్రజల పాలిట కాళరాత్రిగా మారింది. హుద్‌హుద్ తుఫాన్ భీభత్సం సృష్టిస్తూ ప్రజలను భీతా వహులను చేసింది. ప్రకృతి అందాలతో పరవశించే విశాఖ పట్టణాన్ని.. అందులోనూ త్వరలో స్మార్ట్‌సిటీగా అత్యంతాధునిక వసతులతో, సరికొత్త సోయగాలతో రూపుదాలుస్తుందనుకున్న ఆ మహానగరాన్ని నిట్టనిలువునా ధ్వంసం చేసింది.

ప్రళయభీకరంగా ఘర్జిస్తూ వచ్చిన తుఫాన్.. ఆహ్లాదకరమైన సాగరతీరంతో నిత్యం ఎంతో మంది పర్యాటకులను ఆకట్టు కునే అందాల విశాఖను ఒక్క సారిగా కన్నీటి కడలిలో ముంచి వేసింది. అంతేకాదు, పలువురి ప్రాణాలను బలి తీసుకుని,

(మిగతా 10వ పేజీలో)









## ఆ రెండూ... మూతే?

- తెలంగాణలో టీడీపీ, వైసిపిలకు మనుగడ గగనమే!

ఆంధ్రప్రదేశ్‌లో కేసీఆర్ టీఆర్ఎస్ పార్టీని పెడితే ఎలాగుంటుందో తెలంగాణలో ఇప్పుడు తెలుగుదేశం, వైయస్సార్ కాంగ్రెస్‌పార్టీల పరిస్థితి అలా ఉంటుంది. ఏ రాష్ట్రంలోనైనా ఒక ప్రాంతీయ పార్టీ, ఇంకో జాతీయపార్టీ బలంగా ఉంటుంది. లేదంటే ఆ రాష్ట్రానికి సంబంధించిన రెండు ప్రాంతీయపార్టీలు బలంగా ఉంటాయి. అంతేగాని ఒక రాష్ట్రంలో ప్రాంతీయపార్టీ పక్క రాష్ట్రంలో బల పడడం అన్నది జరిగే పని కాదు. ఈ జరగని పని కోసం చంద్రబాబు, జగన్‌మోహన్‌రెడ్డిలు ఆరాటపడడం చూస్తుంటే జాలేస్తుంది.

(మిగతా 10వ పేజీలో)



### శుభాకాంక్షలు

పాఠకులకు,
ప్రకటనకర్తలకు,
చందాదారులకు,
మిత్రులకు,
శ్రేయోభిలాషులకు
దీపావళి శుభాకాంక్షలు.

- సం/-

## కొనసాగిన... విజయ పరంపర

> పిఎస్ఎల్వి-సి26 సక్సెస్



అంతరిక్ష విజ్ఞానంలో భారత ఖ్యాతిని ప్రపంచ వ్యాప్తంగా దశదిశలా చాటుతున్న భారత అంతరిక్ష పరిశోధన సంస్థ గురువారం అర్ధరాత్రి దాటాక 1.32 గంటలకు మరో అద్భుత విజయం సాధించింది. శ్రీహరికోట రాకెట్ కేంద్రంలోని షార్ శాస్త్రవేత్తలు ప్రయోగించిన పిఎస్ఎల్వి సి-26 రాకెట్ నిప్పులు చిమ్ముకుంటూ నింగికెగిసింది. చిమ్మచీకట్లో ఆకాశంలోకి దూసుకుపోయి నిర్ధేశిత కక్ష్యలోకి విజయ వంతంగా ప్రవేశించింది.

ఇటీవల అంగారక యాత్రతో ఘనమైన విజయాన్ని సొంతం చేసుకున్న భారత శాస్రవేత్తలు తాజాగా పిఎస్ఎల్వి సి-26 రాకెట్ ప్రయోగాన్ని విజయ వంతంగా నిర్వహించడంతో అంతరిక్ష ప్రయోగాల్లో మన శాస్త్రవేత్తలు భారత్‌కు మరో అద్భుత

(మిగతా 3వ పేజీలో)



# 'స్వచ్ఛ భారత్'తో పరిశుభ్రతకు పెద్దపీట

**- నెల్లూరు ఎంపి మేకపాటి**



ప్రధాని నరేంద్రమోడీ ఉన్నతాశయాలతో ప్రారంభించిన 'స్వచ్ఛ భారత్' పథకాన్ని నిరంతరం ఒక ఉద్యమంలా కొనసాగించాలని, తద్వారా పరిశుభ్రతకు పెద్దపీట వేయాలని నెల్లూరు ఎంపి మేకపాటి రాజమోహన్‌రెడ్డి అన్నారు. ఈ నెల 13న చేజర్ల మండలంలోని మాముడూరు, పెళ్ళేరు గ్రామాల్లో నిర్వహించిన జన్మభూమి-మా వూరు కార్యక్రమాల్లో ఆయన పాల్గొని మాట్లాడారు. మన పరిసరాలను మనం పరిశుభ్రంగా వుంచుకోవాలన్నారు. ఆరుబయట బహిర్భూమికి వెళ్ళే విధానానికి స్వస్తి చెప్పి ఎక్కడికక్కడ మరుగుదొడ్లను నిర్మించుకోవాలన్నారు. అందుకు ప్రభుత్వం తగు చేయూత అందిస్తుందన్నారు. వ్యక్తిగత పరిశుభ్రతతో అనేక వ్యాధులను దూరం చేసుకోవచ్చని, అదేవిధంగా పరిసరాల పరిశుభ్రతతో మరెన్నో రుగ్మతలను నివారించుకోవచ్చని ఆయన అన్నారు. మరుగుదొడ్ల నిర్మాణానికి లబ్ధిదారులు కూడా కొంతమేరకు శ్రమదానం చేసుకుని, మరుగుదొడ్డి నిర్మించుకోవాలన్నారు. అదేవిధంగా, ప్రభుత్వం వీటి నిర్మాణాల కోసం ఇస్తున్న రూ.12 వేలు చాలదని, కనీసం మరో రూ.3వేలు పెంచాలని ఆయన సూచించారు. గ్రామాల్లో ప్రజలకు పరిశుభ్రమైన మంచినీటిని అందించేందుకు ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఎన్టీఆర్ సుజల స్రవంతి పథకాన్ని అన్ని గ్రామాలకూ విస్తరించాలని ఆయన కోరారు.

ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఆత్మకూరు ఎమ్మెల్యే మేకపాటి గౌతంరెడ్డి మాట్లాడుతూ అధికారులు రాజకీయాలకు అతీతంగా వ్యవహరించాలని, అర్హులైన ప్రతిఒక్కరికీ పింఛన్లు అందజేయాలని కోరారు. అనర్హుల జాబితాల్లోని లబ్ధిదారుల వాస్తవ స్థితిగతులను కూడా క్షేత్రస్థాయిలో పరిశీలించాలని ఆయన అన్నారు.

ఈ కార్యక్రమానికి ఆయా గ్రామాల సర్పంచ్‌లు బాలిరెడ్డి రమాదేవి, చిన్నయ్య అధ్యక్షత వహించారు. మండలాధ్యక్షురాలు ధనలక్ష్మి, ఎంపిటిసి సభ్యులు బాలిరెడ్డి గిరిధర్‌రెడ్డి, వెంకటేశ్వర్లు, ఎంపిడిఒ వాణి, తహశీల్దారు వెంకటేశ్వర్లు, వ్యవసాయశాఖ అధికారి శ్రీదేవి, సిడిపిఒ సత్యవతి, ఎంఇఒ రాజు తదితరులతో పాటు స్థానిక అధికారులు, వైఎస్సార్సీపి నాయకులు పాల్గొన్నారు.



# త్వరలో సాకారంకానున్న క్రీడాగ్రామం

నెల్లూరు జిల్లాలోని యువ ఔత్సాహిక క్రీడాకారులకు రానున్న రోజుల్లో అంతర్జాతీయ స్థాయి క్రీడా మౌళిక సదుపాయాలతో పాటు తమలో దాగివున్న క్రీడా ప్రతిభను ప్రదర్శించుకునేందుకు జిల్లా అధికారులు, నాయకులు ప్రత్యేక చొరవ తీసుకుంటున్నారు. జిల్లాలో అన్ని క్రీడాంశాలలో పటిష్ట ప్రతిభగల క్రీడాకారులున్నారు. జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేటు రంగాలలో పనిచేస్తున్న ఉద్యోగులు సైతం క్రీడలపట్ల ఆసక్తి కనబరుస్తున్నారు. జిల్లా క్రీడాప్రాధికార సంస్థ అధ్యక్షులు, జిల్లా కలెక్టర్ ప్రతిపాదనలు కూడా ఇప్పటికే పంపడం జరిగింది. ప్రభుత్వాలు త్వరలో అంతర్జాతీయస్థాయి ప్రమాణాలతో ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు. నెల్లూరు రూరల్ మండలంలోని మొగుళ్ళపాళెం దగ్గర సుమారు 150 ఎకరాల ప్రభుత్వ స్థలాలను క్రీడాగ్రామంకు కేటాయించారు. ఆ స్థలంలో 1500 కోట్ల రూపాయల కేంద్ర ప్రభుత్వ నిధులతో స్టేడియం ఏర్పాటు చేయనున్నారు. అందులో వివిధ క్రీడా ప్రాంగణాలను నిర్మించేందుకు జిల్లా యంత్రాంగం సన్నాహాలు చేస్తుంది. క్రీడాపోటీల సమయంలో ఇతర దేశాల నుంచి వచ్చే క్రీడాకారులకు వారి అభిరుచులకు, సాంప్రదాయ భోజన వసతి తదితర ఏర్పాట్లను అంతర్జాతీయ స్థాయిలో ఏర్పాటు చేసేందుకు అధికారులు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు. దీంతో నెల్లూరు జిల్లాలో క్రీడలకు మహర్దశ రానున్నది.

# అంబులెన్స్‌లో ఎర్రచందనం రవాణా

**8 మంది స్మగ్లర్ల పట్టివేత**

ఎర్రచందనం అక్రమరవాణాను అదుపు చేసేందుకు ఒకవైపు అధికారులు ఎంత గట్టిగా ప్రయత్నిస్తుంటే, మరోవైపు అంతకు రెండింతల ఎత్తులు వేస్తూ ఎర్రచందనం దుంగలను చాటుమాటుగా తరలించేందుకు ఎర్రచందనం దొంగలు ప్రయత్నిస్తూనే వున్నారు. ఈ నేపథ్యంలో ఎర్రచందనం దుంగలను ఎవరికీ అనుమానం లేకుండా అంబులెన్స్‌లో రవాణాచేస్తున్న స్మగ్లర్లు ఎట్టకేలకు అధికారులకు దొరికిపోయారు.

ఈ నెల 11న కడపజిల్లా పోరుమామిళ్ళ వద్ద ఎర్రచందనం దుంగల దొంగలను పోలీసులు వెంటపడి పట్టుకుని అదుపులోకి తీసుకున్నట్లు సిఐ వెంకటప్ప విలేకరులకు తెలిపారు. పోరుమామిళ్ళ బైపాస్‌రోడ్డులో వాహనాలను తనిఖీ చేస్తున్న పోలీసులకు ఓ అంబులెన్స్‌లో ఎర్రచందనం తరలిస్తున్నట్లు సమాచారం అందడంతో ఆ వాహనాన్ని ఆపగా, వారు ఆపకుండా వెళ్ళిపోవడంతో పోలీసులు వెంబడించి పట్టుకున్నారు. ఆ వాహనంలో వున్న 14 ఎర్రచందనం దుంగలతోపాటు పదిన్నర లక్షల విలువైన ఆ వాహనాన్ని కూడా స్వాధీనం చేసుకున్నారు. పట్టుబడిన వారిలో నెల్లూరుజిల్లా చెన్నారెడ్డిపల్లెకు చెందిన బుచ్చిరెడ్డి, అమ్మవారిపాళెంకు చెందిన గజేంద్ర, వింజమూరుకు చెందిన సుబ్బారెడ్డి, కంద్రిగకు చెందిన మురళి, సీతారామపురం మండలం రాజదేవనచెరువుకు చెందిన లక్షుమయ్య, చిన్నవెంగయ్య, భూమయ్య వున్నట్లు సిఐ తెలిపారు.

# చెత్తపై సమరం చేద్దాం...

పరిసరాలను పరిశుభ్రంగా వుంచుకోవాలని చెప్పడమే కాక, స్వయంగా చీపురు చేతపట్టి అక్కడ ఓ ఇంటి ముందు వున్న చెత్తనంతా వూడ్చి శుభ్రం చేశారు జిల్లా కలెక్టర్ ఎన్.శ్రీకాంత్. ఈ నెల 11న కావలిలో జరిగిన జన్మభూమి-మావూరు కార్యక్రమంలో కలెక్టర్ పాల్గొని స్వచ్ఛ భారత్, స్వచ్ఛాంధ్రప్రదేశ్ సాధనకు అందరూ కృషి చేయాలని ప్రజలకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమాల్లో ప్రజలందరూ భాగస్వాములు కావాలని కోరారు. ఈ సందర్భంగా ఐసిడిఎస్ ఆధ్వర్యంలో పలువురు గర్భిణులకు పండ్లు, మాత్రలు తదితరాలు పంపిణీచేశారు. ఈ కార్యక్రమంలో కావలి ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి, మునిసిపల్ ఛైర్‌పర్సన్ అలేఖ్య, సిడిపిఒ విజయలక్ష్మి, కావలి ఆర్డీఓ లక్ష్మీనరసింహం, మునిసిపల్ కమిషనర్ భానుప్రతాప్, డి.ఇ శ్రీనివాస్, కౌన్సిలర్ పి.అనూరాధ, వైఎస్సార్సీపి నాయకుడు విన్సెంట్ తదితరులు పాల్గొన్నారు.

# గాలిబ్ పై వేటు

ఎర్రచందనం స్మగ్లర్లతో సంబంధాలున్నాయని ఆరోపణలు ఎదుర్కొంటున్న ఆత్మకూరు డివిజన్ డిప్యూటీ ఫారెస్ట్ రేంజర్ షేక్ గాలిబ్ పై సస్పెండ్ వేటు పడింది. ఈమేరకు గుంటూరు జోన్ చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్ అధికారి జిల్లా అటవీ శాఖ కార్యాలయానికి ఉత్తర్వులు పంపారు. ఈమధ్య అనంతసాగరంలో ఎర్రచందనం అక్రమరవాణాకు సహకరిస్తున్న ఇద్దరు వాచర్లను, ముగ్గురు స్మగ్లర్లను పోలీసులు అదుపులోకి తీసుకోవడం జరిగింది. ఇక్కడే పోలీసులకు అటవీ శాఖకు యుద్ధం మొదలైంది. పోలీసులే ఎర్రచందనం స్మగ్లర్లకు సహకరిస్తున్నారంటూ డిఎఫ్ఓ రాంబాబు ఆరోపణలు చేయడం, ఇది దొంగలే దొంగ దొంగ అని అరిచినట్లుగా వుందంటూ పోలీసులు తిప్పి కొట్టడం జరిగింది. పోలీసులపై ఎటువంటి ఆధారాలు లేకుండా ఆరోపణలు చేసిన రాంబాబును ప్రభుత్వం బదిలీ చేయగా, పోలీసు శాఖపై నిందలేసిన అటవీ అధికారిపై న్యాయపోరాటానికి సైతం ఎస్పీ సెంథిల్‌కుమార్ సిద్ధమయ్యారు. ఇంతదూరం నడిచిన కథలో డిఆర్ఓ గాలిబ్ కీలక పాత్రధారి. ఈ సంఘటన జరిగాక శాఖాపరమైన విచారణ జరిగి, స్మగ్లర్లతో అతనికి సంబంధాలు నిజమేనన్నది వెల్లడికావడంతో సస్పెండ్ చేశారు.

# సోమిరెడ్డి వ్యాఖ్యలు దెయ్యాలు వేదాలు వల్లిస్తున్నట్లుంది

**- వైయస్సార్సీపి సిఈసి సభ్యుడు ఎల్లసిరి గోపాల్‌రెడ్డి**

తెలంగాణలో తెలుగుదేశంపార్టీ నాయకులను కేసీఆర్ ప్రలోభపెట్టి టిఆర్ఎస్‌లోకి తీసుకెళుతున్నారని టిడిపి పొలిట్ బ్యూరో సభ్యుడు సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి చేసిన వ్యాఖ్యలు దెయ్యాలు వేదాలు వల్లిస్తున్నట్లుందని వైయస్సార్సీపి సిఈసి సభ్యుడు ఎల్లసిరి గోపాల్‌రెడ్డి వ్యాఖ్యానించారు. నెల్లూరుజిల్లా గూడూరు పట్టణం నరసింగరావుపేటలోని గోపాలరెడ్డి స్వగృహంలో సోమవారం పట్టణ కార్యకర్తలతో సమావేశం నిర్వహించి మాట్లాడుతూ ఎన్నికల అనంతరం వైయస్సార్సీపికి చెందిన ఎంపిని భయపెట్టి టిడిపిలోకి చేర్చుకున్నారన్నారు. రాష్ట్రంలో అనేక మునిసిపల్, జడ్పీ స్థానాల్లో స్పష్టంగా వైయస్సార్ సిపికి మెజార్టీ వచ్చినప్పటికి టిడిపి నాయకులు, జడ్పీటీసీలు, కౌన్సిలర్లకు బహిరంగ వేలం పాటలు నిర్వహించడంతో పాటు వారిని భయభ్రాంతులకు గురిచేసి తమ వైపు తిప్పుకున్నారని ఆరోపించారు. తెలంగాణలో టిడిపి నాయకులు టిఆర్ఎస్‌లోకి వెళుతుంటే సోమిరెడ్డికి నీతినిజాయితీలు ఇప్పుడు గుర్తుకొచ్చాయా అని ప్రశ్నించారు.

# పోలీసులపై మత్స్యకారుల నిరసన


నెల్లూరుజిల్లా ముత్తుకూరు మండలం పైనాపురం గ్రామంలోని టిపిసిఐఎల్ (గాయత్రి) థర్మల్ ప్రాజెక్ట్ వద్ద ఆందోళన చేస్తున్న నేలటూరు పట్టపుపాళెం మత్స్యకారులపై పోలీసులు అనుచితంగా వ్యవహరించడంపై సోమవారం కొద్దిసేపు ఉద్రిక్త వాతావరణం నెలకొంది. పవర్ ప్రాజెక్ట్‌లో ఉద్యోగాలు కల్పించాలని, జరుగుబాటుకు ప్యాకేజీలు ఇవ్వాలని, మిగులు భూములను పునరుద్ధరించాలని ప్రాజెక్ట్ గేటువద్ద మత్స్యకారులు బైఠాయించారు. ఈ సందర్భంగా కృష్ణపట్నం సిఐ గంగా వెంకటేశ్వర్లు, ముత్తుకూరు ఎస్సై మారుతీకృష్ణ తన సిబ్బందితో చేరుకుని కొంతమంది మత్స్యకారులపై చేయిచేసుకున్నారు. ఈ విషయం తెలుసుకొన్న మిగిలిన మత్స్యకారులు, బిజెపి నేత వంశీధర్‌రెడ్డి, జడ్పీటీసీ సభ్యుడు నెల్లూరు శివప్రసాద్, టిడిపి నేతలు ప్రాజెక్టు వద్దకు చేరుకుని మత్స్యకారులకు సంఘీభావం తెలిపారు. దీంతో పరిస్థితి ఉద్రిక్తంగా మారింది. గూడూరు ఆర్డీవో శ్రీనివాస రావు, ముత్తుకూరు తహశీల్దార్ చెన్నయ్య, ప్రాజెక్ట్ నిర్వాహకులు రామకృష్ణారావు, నాగేశ్వరరావుతో చర్చలు జరిపారు. జరిగిన సంఘటనకు వారు విచారం తెలిపారు. సమస్యలు చర్చల ద్వారా పరిష్కరిస్తామని ప్రాజెక్ట్ నిర్వాహకులు హామీ ఇవ్వడంతో పరిస్థితి సద్దు మణిగింది.

# రోడ్లపై ఆక్రమణలు

గూడూరు పట్టణంలో రోడ్లపై ఆక్రమణలకు అడ్డూ అదుపు లేకుండాపోతోంది. కాస్తంత జాగా కనిపిస్తే చాలు అక్కడ దుకాణం వెలుస్తోంది. దీంతో రోడ్డు కుచించుకుపోయి రాకపోకలు సాగించే వాహనచోదకులకు ఇబ్బందిగా మారింది. పరిస్థితి ఇలా ఉన్నా అధికారగణం చూసీచూడనట్లు వ్యవహరిస్తోంది. తరచూ ట్రాఫిక్ సమస్య కూడా తలెత్తుతోంది. పట్టణంలోని ధర్మరాజుల స్వామి దేవస్థానం వెనుక పురపాలక సంఘ అధికారులు ఏడాదికిందట సిమెంటురోడ్డును వేశారు. ఆ రోడ్డును పూర్తిగా ఆక్రమించి దుకాణాలు ఏర్పాటు చేశారు. అటుగా వెళ్ళే వాహనచోదకులు, దుకాణదారులకు మధ్య నిత్యం వివాదాలు చోటు చేసుకుంటున్నాయి. ఆసుపత్రిరోడ్డు, ఐసిఎస్ రోడ్డు, కోనేటిమిట్ట, సుందర్‌మహల్‌రోడ్డు, వివేకానందరోడ్డు తదితర ప్రాంతాల్లో రోడ్లపై దుకాణాలు వెలవడంతో పాటు వాహనాలను కూడా రోడ్లపైనే నిలిపివేస్తున్నారు. ఇకనైనా అధికారులు స్పందించి ఆక్రమణలను తొలగించాలని వాహనచోదకులు, పాదచారులు కోరుతున్నారు.

# దస్తావేజుకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలి

**- నెల్లూరు జిల్లా రిజిస్ట్రార్ మురళీకృష్ణ**



దస్తావేజుకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలని, కోట్ల విలువ చేసే దస్తావేజులో తప్పులు దొర్లితే విని యోగదారుడు ఎంత నష్టపోతారో దస్తావేజు లేఖరులు గుర్తుంచుకోవాలని నెల్లూరు జిల్లా రిజిస్ట్రార్ జి.వి. మురళీకృష్ణ పేర్కొన్నారు. 11వతేదీ నెల్లూరు నగరం భవాని రెసిడెన్సీ కాన్ఫరెన్స్‌హాలులో నెల్లూరుజిల్లా దస్తావేజు లేఖరుల సంఘం ఏర్పాటుచేసిన సబ్‌రిజిస్ట్రార్ల ఆత్మీయ ఆహ్వాన, వీడ్కోలు సన్మానసభకు ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడుతూ దస్తావేజు లేఖరులు మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా మేధాశక్తిని పెంచుకోవాలని సూచించారు. ధనం ప్రాధాన్యత కాకూడదని సూచించారు. న్యాయమూర్తులకు, రిజిస్ట్రార్లకు, సబ్ రిజిస్ట్రార్లకు చెప్పగలిగే తెలివితేటలతో దస్తావేజు లేఖరులు ఉండాలన్నారు. దస్తావేజులు ప్రామాణికంగా తయారుచేస్తే పార్టీలు ఎక్కడ ఉన్నా వెతుక్కుంటూ వస్తారని, ప్రామాణికాన్ని నిలబెట్టుకోవాలని లేఖరులకు సూచించారు. అనంతరం జిల్లా రిజిస్ట్రార్ జివి మురళీకృష్ణ, చిట్ రిజిస్ట్రార్ ప్రసాద్, కావలి సబ్ రిజిస్ట్రార్ ఐ.విజయరాణి, స్టోన్‌హౌస్ పేట సబ్ రిజిస్ట్రార్ వైకె నందకిషోర్, నెల్లూరు జాయింట్ సబ్‌రిజిస్ట్రార్-2 మహమ్మద్ బాషా, సత్తెనపల్లి సబ్‌రిజిస్ట్రార్ విజయప్రసాద్‌లను శాలువలతో, పూలమాలలతో దస్తావేజు లేఖరుల సంఘం తరపున సత్కరించారు. ఈ కార్యక్రమంలో దస్తావేజు లేఖరులు, స్టాంపు వెండర్లు, ఆఫీసు సిబ్బంది పాల్గొన్నారు.

# కల్చరల్ సెంటర్ ముసుగులో కల్యాణ మండపం

## జనావాసాల మధ్య భారీ నిర్మాణం

## మన మునిసిపల్ సిబ్బంది మరో ఘు(ధ)నకార్యం



*అడ్డదారి అనుమతులు, అక్రమనిర్మాణాలతో నెల్లూరు నగరం ఇప్పటికే దరిద్రంగా మారింది. నగరంలో 80శాతం కట్టడాలు అక్రమమేనని నగర పాలక సంస్థ అధికారులే చెబుతున్నారు. నగరంలో రెసిడెన్షియల్ జోన్, నాన్ రెసిడెన్షియల్ జోన్, కమర్షియల్ జోన్ అనే తేడా లేకుండాపోతుంది. నివాస ప్రాంతాల్లో కూడా కల్యాణ మండపాలు, కమర్షియల్ కాంప్లెక్స్‌లు వెలుస్తున్నాయి.*

ఇప్పటికే సరైన పార్కింగ్ వసతి లేకుండా 200అంకణాలు, 300అంకణాల స్థలాలలో కట్టిన కల్యాణ మండపాలతో ఎన్నోరకాల సమస్యలు తలెత్తుతున్నాయి. నగరంలో పలు ప్రాంతాల్లో మెయిన్‌రోడ్ల వెంబడే పెద్ద సంఖ్యలో కల్యాణ మండపాలు కట్టి ఉన్నారు. వీటికి పార్కింగ్ వసతి ఉండదు. పెళ్లిళ్ల సీజన్‌లో ఒక్కో కల్యాణ మండపం వద్దకు పెద్ద సంఖ్యలోనే కార్లు వస్తుంటాయి. వీటికి పార్కింగ్ లేకపోవడంతో రోడ్లపైనే నిలిపి కల్యాణ మండపాలలోకి పోతుంటారు. ఆ సమయంలో ఆ రోడ్లలో విపరీతమైన ట్రాఫిక్ రద్దీ నెలకొని ఉంటుంది. ఇందుకు నగరంలోని పోలీసు ఆఫీసు రోడ్డే ఒక ఉదాహరణ. రామ్మూర్తినగర్‌లో ఇళ్ళ మధ్యలో కట్టిన బాలపీరయ్య కల్యాణ మండపం కూడా మరో పెద్ద ఉదాహరణగా పేర్కొనవచ్చు. ఈ విధంగా ఇప్పటివరకు కట్టిన కల్యాణ మండపాలతోనే ప్రజలకు ట్రాఫిక్‌తో నరకం కనపడుతుంటే, నిబంధనలకు విరుద్ధంగా మాగుంట లే అవుట్, లెక్చరర్స్ కాలనీలో 200అంకణాల స్థలంలో ఓ కల్యాణ మండపం నిర్మాణానికి అనుమతినిచ్చి మరో ఘనకార్యానికి శ్రీకారం చుట్టారు మన కార్పొరేషన్ అధికారులు. లెక్చరర్స్ కాలనీ పూర్తిగా నివాసప్రాంతం. ఇప్పటికే పెద్దసంఖ్యలో ఇళ్లున్న ప్రాంతంలో హోటల్ అభిరామ్ యాజమాన్యం అభిరామ్ కల్చరల్ సెంటర్ పేరుతో కల్యాణ మండపం నిర్మాణం మొదలుపెట్టింది. 33అంకణాల సైజు గల ఆరుప్లాట్లలో ఈ నిర్మాణం జరుపుతున్నారు. గత ప్రభుత్వంలోనే శాసనసభ్యు లుగా వున్న వారి ద్వారా సిఫార్సు చేయించుకుని ప్లాన్ అప్రూవల్ తీసుకున్నారు. 150 అంకణాల పైబడిన స్థలంలో నిర్మాణానికి అనుమతి కావాలంటే హైదరాబాదుకు వెళ్లా ల్సిందే. అయితే 200అంకణాలను విడగొట్టి 150అంకణాల లోపు స్థలాన్ని మాత్రమే ప్లాన్‌లో చూపించి నెల్లూరు పరిధిలోనే అనుమతిని తీసేసుకున్నారు. ఇక్కడ చుట్టూ ఇళ్ళే. దీని శంకుస్థాపనకు ఆనాడు ఎమ్మెల్యేలుగా వున్న ఆనం వివేకానందరెడ్డి, ముంగమూరు శ్రీధరకృష్ణారెడ్డిలతో పాటు మాజీమేయర్ భానుశ్రీ కూడా హాజరయ్యారు. వీళ్ల అండ దండలుండబట్టే ఆరోజు స్థానికుల అభ్యంతరాలను కూడా పక్కనపెట్టి ఇక్కడ కల్యాణ మండపంకు అనుమతినిచ్చారు. ఈ కల్యాణ మండపం పూర్తయితే పెళ్లిళ్లసీజన్‌లో చుట్టపక్కల ఇళ్లల్లో జనాలు ఉండలేని పరిస్థితి. ఇప్పటికే సమీపంలోని రోడ్డుని సైతం ఆక్రమించి అక్రమంగా నిర్మించబడిన అనిల్ గార్డెన్స్ వీరికి నరకం చూపిస్తుంది. వివాహ సమయాలలో జనరేటర్ సౌండ్‌లు, వాయిద్యాలు రాత్రివేళల్లో స్థానికులకు కంటి మీద కునుకులేకుండా చేస్తున్నాయి. అభిరామ్ కల్చరల్ సెంటర్ కూడా తోడైతే సమీప ఇళ్లల్లో ఉండేవాళ్లు ఇంకో చోటకు వలసపోవాల్సిందే! అంతేగాక లెక్చరర్స్ కాలనీ మెయిన్ రోడ్డు ఇప్పుడు ప్రశాంతంగా వుంది. కల్యాణ మండపం వస్తే వాహనాల రద్దీతో ఆ ప్రశాంతత కరువవుతుంది. నగరపాలక సంస్థ కొత్త పాలక వర్గం ఏర్పడ్డాక తొలికౌన్సిల్ సమావేశం లోనే 39వ డివిజన్ కార్పొరేటర్ కె.లక్ష్మీ సునంద ఈ సమస్యను లేవనెత్తారు. ప్రస్తుతం దీని నిర్మాణానికి బ్రేక్ పడింది. అభిరామ్ యాజమాన్యం మాత్రం నిర్మాణం పూర్తి చేయడానికి హైదరాబాద్ స్థాయిలో పైరవీలు చేస్తున్నట్లు తెలుస్తుంది. కన్వెన్షన్ సెంటర్‌లు, కల్యాణ మండపాలు ప్రజలకు సౌకర్యంగా ఉండాలేగాని వారికి ఇబ్బంది కలిగించేలా ఉండ కూడదు. నెల్లూరీయులకు ఒక మంచి కల్యాణ మండపాన్ని అందించాలనే కోరిక అభిరామ్ యాజమాన్యానికి నిజంగా ఉంటే దానిని మార్కెట్ రేటు ప్రకారం 6కోట్ల రూపాయల విలువ పలికే స్థలంలో ఇళ్ళ మధ్యలో కట్టాల్సిన అవసరం లేదు. నగరానికి దూరంగా అదే ధరకి 6యకరాల స్థలంలో నాన్‌రెసిడెన్షియల్ జోన్‌లో సువిశాలమైన ప్రాంగణంలో అద్భుతంగా నిర్మించవచ్చు. పచ్చిపులుసు వారు ఒక్కసారి ఆలోచిస్తే మంచిది.

## మాగుంట లే అవుట్ యం.యస్.ఆర్. పార్కులో

# గ్లోబల్ హ్యాండ్‌వాష్ డే





ఇంటర్నెట్ ద్వారా ప్రపంచం మనిషి అరచేతి వేళ్ళలోకి వచ్చిన తరువాత ఇప్పుడు ప్రతి పనికి ఓ ప్రత్యేకత వచ్చేసింది. ప్రతి సందర్భానికి ఓ రోజు వచ్చేసింది. అలాంటి రోజుల్లో భాగంగా అక్టోబర్15వ తేదీన వచ్చిందే గ్లోబల్ హ్యాండ్‌వాష్ డే... అంటే ప్రపంచ చేతులు కడుక్కునే దినం. ఈ సందర్భాన్ని పురస్కరించుకుని జిల్లాలో అన్ని ప్రభుత్వ శాఖలూ వివిధ ప్రాంతాలలో ప్రజాప్రతినిధులు, స్థానిక అసోసియేషన్లు, పాఠశాలలను కలుపుకుని చైతన్య కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో చేతులు కడుక్కోవడం వల్ల కలిగే లాభాలు, అలా చేయకపోవడం వల్ల కలిగే నష్టాలను వివరించి, ముఖ్యంగా చిన్నపిల్లలలో ఈ విషయంపై అవగాహన కల్పించాలి. నెల్లూరు మునిసిపల్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం మాగుంట లే అవుట్‌లోని మాగుంట సుబ్బరామిరెడ్డి స్మారక ఉద్యానవనంలో ఏర్పాటు చేసారు. పార్క్ ఆనుకుని ఉన్న కేకేఆర్ గౌతం స్కూల్‌కు చెందిన 8,9,10 వ తరగతి విద్యార్థులకు హ్యాండ్‌వాష్‌పై అవగాహన కల్పించి వారి చేత పార్క్ ఆవరణంలో మొక్కలు నాటించారు.

ఈ కార్యక్రమంలో మునిసిపల్ డిప్యూటి కమీషనర్ వీరభద్రంతో పాటు ఇంజనీర్ సంపత్ కుమార్ వారి సిబ్బంది పాల్గొన్నారు. మాగుంట లే అవుట్ రెసిడెంట్స్ అసోసియేషన్ తరపున అధ్యక్షుడు శివప్రభాత్‌రెడ్డి, కార్యదర్శి కనుమూరు శ్రీనివాసులరెడ్డి, సహకార్యదర్శి చంద్రయ్యచౌదరిలతో పాటు వార్డు కార్పొరేటర్ నూనె మల్లికార్జున్ యాదవ్, కె.కె.ఆర్ గౌతమ్ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు యం.విజయభాస్కర్ మరియు పాఠశాల బోధన సిబ్బంది పాల్గొన్నారు.



# విజయపరంపర

(మొదటిపేజీ తరువాయి)

విజయాన్ని నమోదు చేసినట్లయింది. భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ (ఇస్రో) పూర్తి స్వదేశీ పరిజ్ఞానంతో రూపొందించిన పోలార్ శాటిలైట్ లాంచ్ వెహికల్ (పిఎస్ ఎల్‌వి) ద్వారా, ఇప్పటిదాకా ఇస్రో 27 ప్రయోగాలను నిర్వహించగా, ఇందులో కేవలం ఒకే ఒక్కటి మినహా, మిగిలినవన్నీ ఆశించిన లక్ష్యాలను సాధించి అత్యద్భుత విజయాలనే తెచ్చిపెట్టాయి. వరుస ఘన విజయాలు సాధించిన పిఎస్‌ఎల్‌వి తరహా రాకెట్లు అంతరిక్ష రంగంలో భారత ప్రతిష్టను మరింతగా పెంచాయి.

తాజాగా, సమాచార వ్యవస్థకు సంబంధించిన నావిగేషన్ ఉపగ్రహాన్ని భారత శాస్త్రవేత్తలు గగనతలంలోకి విజయవంతంగా పంపారు. షార్‌లోని రెండవ ప్రయోగ వేదికపైనుంచి 1326 కేజీల బరువున్న, సమాచార వ్యవస్థకు సంబంధించిన ఉపగ్రహాన్ని పిఎస్‌ఎల్‌వి నాలుగు దశల్లో నిర్ణీత భూ స్థిర కక్ష్యలోకి ప్రవేశపెట్టింది. దీంతో, పిఎస్‌ఎల్‌వి ఖాతాలో మరో విజయం నమోదైనట్ల యింది. ఇదిలావుంటే, షార్ కేంద్రం నుంచి రాత్రివేళ జరుపుతున్న రాకెట్ ప్రయోగాల్లో ఇది రెండవది. 2013లో జులై 13వ తేదీన కూడా ఇలాగే ఐఆర్‌ఎన్ ఎస్‌ఎస్-1ఏ ఉపగ్రహాన్ని మన శాస్త్ర వేత్తలు రాత్రిపూట నింగిలోకి విజయవంతంగా పంపారు. అయితే, ఈ సారి పెద్ద హడావిడీ ఏమీ లేకుండానే రాకెట్ ప్రయోగాన్ని విజయవంతంగా నిర్వహిం చడం మన శాస్త్రవేత్తల ప్రత్యేకతగా భావించవచ్చు. రాకెట్ ప్రయోగం విజయవంతం కావడంతో షార్ శాస్త్రవేత్తల ఆనందానికి అవధులు లేవు. ప్రయోగం అనంతరం ఇస్రో ఛైర్మెన్ రాధాకృష్ణన్ శాస్త్రవేత్తలందరినీ ఎంతో సంతోషంతో అభినందించారు.

భారత భూభాగ సమాచారాన్ని ఏకకాలంలో తెలుసుకోవడం, విమానాలు, ఓడల గమనాన్ని నిర్దేశించేందుకు అవసరమైన భారత ప్రాంతీయ దిక్సూచి ఉపగ్రహ వ్యవస్థ రూపకల్పనలో భాగంగా, పిఎస్‌ఎల్‌వి సి-26 రాకెట్ ద్వారా ఐఆర్ ఎన్‌ఎస్‌ఎస్-1సి (ఇండియన్ రీజనల్ నావిగేషన్ శాటిలైట్ సిస్టమ్) ఉపగ్రహాన్ని తాజాగా శ్రీహరికోట నుంచి నింగిలోకి పంపడం జరిగింది.. ఇప్పటికే ఐఆర్‌ఎన్‌ఎస్‌ఎస్-1ఏను 2013లో, ఐఆర్‌ఎన్‌ఎస్‌ఎస్-1బిని 2014లో పంపివున్నారు. ఇది మూడవది. కాగా, ఐఆర్‌ఎన్‌ఎస్‌ఎస్ ఉపగ్రహాలు భూతల, ఆకాశ, సాగర నావిగేషన్ సేవలు అందిస్తాయని, విపత్తుల సమయంలో బాధితులకు బాసటగా పని చేస్తాయని శాస్త్రవేత్తలు పేర్కొంటున్నారు. నావిగేషన్ వ్యవస్థకు సంబంధించి మొత్తం ఏడు ఉపగ్రహాలను రూపొందించి ప్రయోగించాలని శాస్త్రవేత్తలు భావిస్తు న్నారు. కాగా, శ్రీహరికోట రాకెట్ కేంద్రం నుంచి ఇప్పటిదాకా మొత్తం 43 రాకెట్ ప్రయోగాలు జరిగితే, అందులో 35 విజయవంతం కావడం భారత శాస్త్రవేత్తల ప్రతిభాపాటవాలకు నిదర్శనం. ఈ రాకెట్‌ల ద్వారా 35 స్వదేశీ ఉపగ్రహాలతో పాటు, 33 విదేశీ ఉపగ్రహాలను కూడా రోదసిలోకి ప్రవేశపెట్టారు. భారత శాస్త్రవేత్తలు ఇలా అంతరిక్ష రంగంలో చేస్తున్న అపారమైన కృషికి, సాధిస్తున్న ఘనవిజయాలకూ దేశ వ్యాప్తంగా ప్రజలంతా మనసారా అభినందనలు తెలియజేస్తూ శాస్త్రవేత్తలకు జేజేలు పలుకుతున్నారు.







# 'ప్రభా'తం

ఒక భీభత్సం..ప్రళయభీకరంగా జడలు విప్పి విలయతాండవం చేసింది. ఆనంద సాగర తీరాల్లో వున్న జనజీవనాన్ని ఒక్కసారిగా అస్తవ్యస్తం చేసి వికటాట్టహాసం చేసింది. ఝుంఝామారుతంగా విరుచుకుపడుతూ, హూంకరిస్తూ వచ్చిన హుద్‌హుద్ తుఫాన్ దెబ్బకు అందమైన విశాఖపట్నం గుండె చెదిరిపోయింది. సుందరమైన విశాఖపట్నం విషాదపట్నంగా రూపుమారిపోయింది. ఈ భయంకరమైన తుఫాను..పచ్చని పంటపొలాలతో కళకళలాడే ఉత్తరాంధ్రను కన్నీటిసంద్రంగా మిగిల్చింది. నవనవలాడే నవ్యాంధ్రను గడగడలాడించింది. విశాఖ, విజయనగరం, శ్రీకాకుళం, తూర్పుగోదావరి జిల్లాల్లో అనేక జనావాసప్రాంతాలపైకి కర్కశంగా దూసుకువచ్చిన ఆ తుఫాన్ ధాటికి ప్రజలు విలవిల్లాడిపోయారు. మొత్తంగా ఈ విలయానికి 21 మంది దాకా ప్రాణాలు కోల్పోయారు. లక్ష కోట్ల రూపాయల దాకా ఆస్తి నష్టం సంభవించింది. ఇదీ హుద్‌హుద్ తుఫాన్ నిర్వాకం.

ప్రకృతి ఇప్పుడే కాదు..ఎప్పుడూ ఇంతే!..ఏమాత్రం ఆగ్రహించినా ప్రజల జీవితాలు గల్లంతే!..హోరెత్తే ఈదురు గాలులు..ఫెళఫెళార్భాటాలతో ఉరుములు, కళ్ళుమిరుమిట్లు గొలిపే మెరుపులు..మరోవైపు గాఢాంధకారం..ఎప్పుడు ఏ క్షణాన మృత్యువు వచ్చి పైనపడుతుందో అన్నంత భయం..రోడ్లు-వంతెనలు ధ్వంసం కావడం, ఆస్తులన్నీ విధ్వంసమైపోవడం..పొలం పుట్రా అంతా నీటమునిగిపోవడం..ఇళ్ళు.. మహావృక్షాలూ కూలిపోవడం, విద్యుత్‌స్తంభాలు నేలకూలడం.. అరుపులు.. ఆర్త నాదాలు..రక్షించండంటూ అసహాయుల హాహాకారాలు... ఇవీ తుఫాన్ భీభత్స దృశ్యాలు. కోస్తా ప్రాంతంవారికీ, తీరప్రాంతాల ప్రజలకీ తుఫాన్‌లు కొత్త కాకపోయినా, హుద్‌హుద్ మరింత తీవ్రరూపందాల్చి హుంకరించడంతో అనేక పట్టణాలు, పల్లెలూ గజగజవణికిపోయాయి. విశాఖ మహానగరం రూపు మారిపోయి..పూర్తిగా ఛిన్నాభిన్నమైంది.

అసలే నవ్యాంధ్ర..పురిటినుంచే నానా కష్టాలు. భారీ లోటుబడ్జెట్‌తో, అప్పుల ఊబిలో కూరుకుపోయి ఇప్పుడిప్పుడే నిలదొక్కుకునేందుకు కాలూచేయి కూడదీసుకుంటున్న సమయం. రాజధాని కూడా లేక సతమతమవుతున్న దుస్థితి. గత ఎదురుదెబ్బల నుండి అన్ని రంగాల్లో వెనుకబడిపోయిన స్థితి నుంచి తిరిగి కోలుకునేందుకు రెక్కలు విప్పుకుంటున్న తరుణం. ఇన్ని కష్టాలూ ముప్పిరిగొన్న సమయంలోనే మరో పెనుముప్పు హుద్‌హుద్ తుఫాన్‌లా ముంచెత్తుకు రావడం నిజంగా దురదృష్టకరం. అందులోనూ ఎంతో అందమైన సాగరతీరం విశాఖకు వరం. ప్రగతిపథంలో ముందుకుసాగుతున్న పట్టణం..నవ్యాంధ్ర ప్రగతికి మకుటాయమానంగా వుండేది. అంతటి సుందరమైన పట్టణాన్ని తుఫాన్ విలయం ఒక్క రోజులోనే సర్వనాశనం చేసేసింది. దాదాపు 1030 కిలోమీటర్ల తీరప్రాంతంతో, దేశంలోనే అత్యంత పొడవైన తీరప్రాంతం వున్న రెండవ రాష్ట్రంగా పేరొందిన మన రాష్ట్రంలో, సాగరతీరప్రాంతాల ద్వారా రవాణా మార్గాలను మరింత సులభతరం చేయవచ్చని, పర్యాటకంగా అంతర్జాతీయస్థాయిలో సాగరతీరాలను, విశాఖను మరింత అభివృద్ధిచేసుకోవచ్చని భావిస్తున్న సమయంలో.. సరిగ్గా ఆ ఆశలన్నిటినీ ఈ ప్రళయభీకర తుఫాన్ కాలరాసింది. ఈ విలయానికి ఉక్కు నగరం బిక్కుబిక్కుమంటూ హడలిపోయింది.. సాగరతీరపు అందాలు కాస్తా తుడిచిపెట్టుకుపోయి అంతటా విషాదమే మిగిలింది. ఒక్కమాటలో చెప్పాలంటే నవ్యాంధ్ర కలలు గన్న ఒక అద్భుత స్వర్గం తుఫాన్ గాలికి తౌణికిపోయింది. పగిలిన స్వప్నం మాత్రం నిర్వికారంగా మిగిలిపోయింది. ఈ విలయంలో ఒక్క విశాఖ ఉక్కు కర్మాగారానికే దాదాపు రూ.340 కోట్ల దాకా నష్టం వాటిల్లింది. నౌకా దళానికి మరో రూ.2వేల కోట్ల నష్టం జరిగింది. అక్కడున్న విమానాశ్రయానికి రూ. 5వందల కోట్ల నష్టం జరిగితే, రోడ్లకు మరో రూ.5వందల కోట్ల నష్టం జరిగింది. విశాఖ ఫిషింగ్ హార్బర్ ధ్వంసమైపోయి, అక్కడున్న మత్స్యకారులకు సంబంధించి కోట్ల విలువచేసే పడవలు, మరపడవలు అన్నీ ఎక్కడివక్కడ నాశనమైపోయాయి. వారి కష్టాలు దేవుడికే ఎరుక. ఇక ఇళ్ళూ, పంటలూ, ఆస్తులూ సర్వస్వం కోల్పోయిన ప్రజల బాధలు వర్ణనాతీతం..హృదయవిదారకం. ఈ తుఫాన్ ధాటికి 40 వేల విద్యుత్‌స్తంభాలు నేలకొరిగిపోయాయంటే, తుఫాన్ సమయంలో వీచిన పెనుగాలుల బలమెంతో తెలుస్తుంది. ఇళ్ళేమిటి..మహావృక్షాలే కూకటివేళ్ళతో సహా నేలకూలిపోయాయి. ఇంతటి విపత్తును మున్నెన్నడూ ఎరుగం. ఇది ఘోరమైన విపత్తు. దీనిని కేంద్రం జాతీయ విపత్తుగా పరిగణించాలి. అసహాయులై ఆక్రందిస్తున్న ప్రజలను అందరూ కలసి ఆదుకోవాలి. అందుకు తామున్నామంటూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వెంటనే రంగంలోకి దిగి ప్రజలకు తక్షణసేవలు అందించడం ఎంతో అభినందనీయం. సాక్షాత్తూ ప్రధాని నరేంద్రమోడీ విశాఖను సందర్శించి ఆపన్నులను ఆదుకునేందుకు భారతప్రభుత్వం ఎల్లవేళలా సంసిద్ధంగా వుంటుందని భరోసా ఇచ్చారు. అంతేకాదు, అక్షరాలా వెయ్యికోట్ల రూపాయలను తక్షణ సాయంగా ప్రకటించడం ఎంతైనా సంతోషకరం. ప్రజలకు అండగా వుంటామని, తిరిగి సాధారణ పరిస్థితులు నెలకొనేందుకు రాష్ట్రప్రభుత్వానికి అన్నివిధాలా సహకరిస్తామని ప్రధాని స్పష్టం చేశారు. రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు విశాఖలోనే వుండి బాధితులైన ప్రజలను అన్నివిధాలా ఆదుకునేందుకు సకల చర్యలూ తీసుకుంటున్నారు. అధికారయంత్రాంగం యావత్తూ ప్రజలకు తక్షణ సౌకర్యాల కల్పనకు ముమ్మర ఏర్పాట్లు చేస్తున్నారు.

అయితే, తుఫాన్‌ను ముందస్తుగా గుర్తించే శాస్త్రసాంకేతిక పరిజ్ఞానం సహాయంతో, ఇంతటి భారీ విలయంలోనూ మృతుల సంఖ్యను గణనీయంగా తగ్గించుకోగలిగామనే చెప్పాలి. లక్షలాది ప్రజలను ముందస్తు జాగ్రత్తగా సురక్షిత ప్రాంతాలకు తరలించడం వల్లనే ఇది సాధ్యమైందని చెప్పవచ్చు. తుఫాన్‌తో ప్రాణనష్టం భారీగా జరుగకుండా నివారించినందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు ధన్యవాదాలు తెలపాలి కూడా. అయితే, ఆస్తి నష్టం మాత్రం అపారంగానే జరిగింది. ఆ బాధల నుంచి ప్రజలు ఇక కోలుకోవాలి. వేలు, లక్షలాదిగా ప్రజలు ఈ ఘోర విపత్తుకు అనేక కష్టనష్టాలకు గురయ్యారు. వారి వేదన, మృతి చెందిన వారి కుటుంబాల రోదన.. రాష్ట్ర వ్యాప్తంగానే కాదు, దేశవ్యాప్తంగా అన్ని ప్రాంతాల్లోని ప్రజలందరికీ ఎంతో ఆవేదన కలిగిస్తూనే వుంది. బాధితులను ఆదుకునేందుకు ఇప్పటికే రాష్ట్రంలోని అనేకప్రాంతాల ప్రజలు, ప్రముఖులు, వదాన్యులు, స్వచ్ఛందసంస్థలు ముందుకు కదిలాయి. తుఫాన్ బాధితులకు తమవంతుగా వేలకొద్దీ ఆహారపొట్లాలు, నిత్యావసర సరుకులు పంపిణీకి సిద్ధం అవుతున్నారు. ఎవరికి చేతనైన సాయం వారు చేసేందుకు సమాయత్తమవుతున్నారు. పవర్‌స్టార్ పవన్ కల్యాణ్ రూ.50లక్షలు, మెగా పవర్‌స్టార్ రాంచరణ్ మరో 10 లక్షలు విరాళం ప్రకటించడం అభినందనీయం. వారే కాదు, ఎవరైనా సరే, అందరూ కలసి ఆపదలో వున్నవారిని ఆదుకోవాలి. అదే మానవతా ధర్మం. అందుకు ప్రతిఒక్కరం కార్యోన్ముఖులు కావాలి. తుఫాన్ బాధిత ప్రాంతాలు తిరిగి జవజీవాలు పుంజుకుని తిరిగి కళకళలాడేలా ప్రజలంతా ఒక్కటిగా కలసి తమవంతు చేయూతను అందించాలి!.. ఇదే తక్షణ కర్తవ్యం!...

## తౌణికిన స్వప్నం



పర్యాటకంగా అంతర్జాతీయ స్థాయిలో సాగరతీరాలను, విశాఖను మరింత అభివృద్ధి చేసుకోవచ్చని భావిస్తున్న సమయంలో... సరిగ్గా ఆ ఆశలన్నిటినీ ఈ ప్రళయ భీకరతుఫాన్ కాలరాసింది. ఈ విలయానికి ఉక్కు నగరం బిక్కుబిక్కుమంటూ హడలిపోయింది. సాగరతీరపు అందాలు వూడ్చుకుపోయి.. అంతటా విషాదమే మిగిలింది.

# మానవత్వంతో స్పందిద్దాం



చేయి చేయి కలిపితే కొండంత కష్టమైనా గోరంత అవుతుంది. సంకల్పం ముందు కన్నీళ్లు కూడా కనుమరుగవుతాయి.

ఎదుటివాడు బాగున్నప్పుడు కాదు, బాధలో ఉన్నప్పుడే మనం ఓదార్చాలి. చేతనైన సాయం అందించాలి. స్వాంతన చేకూర్చాలి. ప్రస్తుతం సమాజంలో అవినీతి, అక్రమాలు పెరిగిపోతున్నాయి. ప్రతివాడు 'నాది' అనుకునే స్వార్థం రాజ్యమేలుతోంది. అయితే మనిషిలో మానవత్వం పూర్తిగా అంతం కాలేదు. అది ఇంకా ఎంతోకొంత మిగిలేవుందని నిరూపించేందుకు ప్రకృతి మనిషికి కొన్ని పరీక్షలు పెడుతుంటుంది. మనిషిలోని మానవత్వాన్ని బయటకు తీస్తుంది. ఇప్పుడు హుదూద్ తుఫాన్ రూపంలో మనిషికి అలాంటి పరీక్షే పెట్టింది. మరి ఆ పరీక్షలో మనిషి నెగ్గాల్సివుంది.

దేశంలో ఏ మూల ప్రకృతి వైపరీత్యాలు సంభవించి, సాటి మనుషులు కష్టాల్లో ఉన్నారన్నప్పుడల్లా మానవత్వంతో స్పందించడంలో నెల్లూరీయుల దెప్పుడూ పైచేయిగానే ఉంటుంది. దాదాపు పదిహేనేళ్ల క్రితం గుజరాత్‌లోని కచ్, భుజ్ ప్రాంతాల్లో భూకంపం సంభవించి వేలాదిమంది మృత్యువాత పడి, లక్షలాది మంది నిరాశ్రయులైనప్పుడు నెల్లూరీయులు చూపిన మానవత్వం వెలకట్టలేనిది. అక్కడ తిండి, నిద్ర లేక అల్లాడుతున్న బాధితుల కోసం మన నెల్లూరోళ్లు నిద్రాహారాలు మానేసి ఆహారధాన్యాలు, దుస్తులు, ఇతర వస్తువులు సేకరించి గుజరాత్‌కు పంపించారు. మహారాష్ట్రలోని లాతూర్‌లో భూకంపం సంభవించినప్పుడు, ఒరిస్సాను తుఫాన్‌లు కుదిపేసినప్పుడు, కోస్తాను వరదలు, కర్నూలును కృష్ణానది ముంచెత్తినప్పుడు.... ఇలా ప్రతి సందర్భంలోనూ నెల్లూరీయులు తమ విశాలహృదయాన్ని చాటుకున్నారు. కోటీశ్వరులే కాదు రోజుకూలీ చేసుకుని జీవించేవాళ్లు కూడా ప్రకృతి వైపరీత్య సేవాకార్యక్రమాలలో పాలుపంచుకున్నారు.

ఇప్పుడు ఉత్తరాంధ్ర బాధితుల విషయంలో కూడా మనం అదే స్ఫూర్తిని ప్రదర్శించాల్సివుంది. మన సోదర బాధితుల కన్నీటిని తుడవాల్సిన బాధ్యత మనది. వాళ్ల కష్టం మనది అనే సంకల్పంతో ప్రతిఒక్కరూ ఓ చేయి వేస్తే మానవత్వపు తుఫాన్ ముందు హుదూద్ తుఫాన్ వెలవెలబోతుంది.




## బాధితులకు అండగా నిలుద్దాం

విశాఖపట్నాన్ని పెనుతుఫాను కుదిపేసింది. భారీ ఆస్తినష్టం సంభవించింది. తలో చెయ్యి వేస్తే బాధితులను ఆదుకోవడం పెద్ద సమస్య కాదు. గతంలో ఎన్నో ప్రకృతి వైపరీత్యాలు సంభవించినప్పుడు తమ మానవతా హృదయాన్ని చాటుకున్న దాతలు స్పందించాలి.

**కరేటి మధు, దగదర్తి.**

## నవంబర్ ఒకటి

నవంబర్ 1తో ఆంధ్రప్రదేశ్ అవతరణకు 60ఏళ్లు. కాని రాష్ట్ర విభజనతో నవంబర్ 1 చారిత్రాత్మక అంశంగా మిగిలిపోతుంది. ఈ తేది శూన్యంలో చేరిపోతుంది. **– వాస్తు రామచంద్ర, నెల్లూరు.**

## హిందూ ధర్మాన్ని రక్షించండి

రాష్ట్రంలో అధిక ఆదాయం గల దేవస్థానాలకు అనుబంధంగా విద్య, వైద్య కేంద్రాలను ఏర్పాటు చేయాలని ప్రభుత్వం భావిస్తోంది. దేవుడి పేరు మీద ప్రజలకు సేవ చేయడం మంచిదే. అయితే ఆ దేవస్థానాల నిధులతో ఏర్పాటు చేసిన సంస్థలలో హిందూధర్మం, సంస్కృతి గురించి తెలియజెప్పాలి. క్రైస్తవ మిషనరీలలో తమ సొంత మత సంస్కృతి ప్రచారానికి ఎలా ప్రాధాన్యతనిస్తారో, హిందూ సంస్థల నిధులతో నడిచే సంస్థలలో కూడా హిందూధర్మ ప్రచారానికి ప్రాధాన్యమివ్వాలి.

**సి. రాజీవి, నెల్లూరు.**

## ప్రతిపక్ష నేతను గౌరవించాలి

రాష్ట్రంలో బలమైన ప్రతిపక్ష నేత వై.యస్.జగన్మోహన్ రెడ్డి. మొన్న ఎన్నికల్లో అధికార, ప్రతిపక్షాల మధ్య ఓట్ల తేడా చాలా తక్కువగానే వుంది. చంద్రబాబు లాగా నోటి కొచ్చిన వాగ్దానమల్లా చేయకపోవడం వల్లే జగన్ అధికారానికి దూరమయ్యారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేర్చాల్సిన బాధ్యత చంద్రబాబు మీద ఉంది. ప్రజల సమస్యలపై పోరాడే హక్కు ప్రతిపక్ష నేతకుంటుంది. ప్రతిపక్షనేత గురించి అగౌరవంగా మాట్లాడడం తెలుగుదేశం నాయకులకు సముచితం కాదు.

**బి.ఆర్. శాలి, కావలి.**

● 'బీద' కోరిక

# పెద్దాయన సేవ..

# లేదంటే పెద్దల సభ?



జిల్లాలో తెలుగుదేశంపార్టీకి విధేయతగా నిలిచన వారిలో బీద సోదరులు ముందు వరుసలో ఉంటారు. పార్టీ పట్ల వారి విధేయతను, భక్తిని ఎవరూ సందేహించలేరు. తమకు రాజకీయ మార్గదర్శి అయిన ఆదాల ప్రభాకర్‌రెడ్డి 2004లో తెలుగుదేశాన్ని వీడి కాంగ్రెస్‌లో చేరినప్పుడు కూడా బీద సోదరులు పార్టీని వదిలిపెట్టలేదు. బీద సోదరులిద్దరు కూడా పార్టీ కోసం సొంత డబ్బు ఖర్చు పెట్టారేగాని, పార్టీ పరంగా వారు లబ్దిపొందిందేమీ లేదు. బీద మస్తాన్‌రావు మూడుసార్లు అసెంబ్లీకి పోటీచేసి ఒకసారి గెలుపొందారు. పార్టీ వ్యవహారాలలో చూస్తే బీద రవిచంద్రది చాలా ముఖ్యపాత్ర. 2000లో జడ్పీ ఎన్నికల్లో పోటీ చేసిన రవిచంద్ర వెంట్రుకవాసి తేడాలో ఛైర్మెన్ పదవిని కోల్పోయాడు. మూడేళ్ల క్రితం స్థానిక సంస్థల శాసనమండలికి జరిగిన ఎన్నికల్లో తెలుగుదేశం అభ్యర్థిగా పోటీచేసి పరాజయం పాలయ్యారు. పార్టీ పరంగాచూస్తే జిల్లాలో వివిధ పదవుల్లో పనిచేసిన రవిచంద్ర, పార్టీ ప్రతిపక్షంలో వున్నప్పుడు తెలుగుయువత రాష్ట్ర అధ్యక్షుడిగా అత్యంత సమర్థవంతంగా బాధ్యతలు నిర్వర్తించారు. జిల్లా పార్టీ అధ్యక్ష పదవి నుండి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి తప్పుకుని పొలిట్‌బ్యూరోలోకి పోవడంతో ఆ పదవిలోకి రవిచంద్రను తీసుకోవడం జరిగింది. మొన్నటి ఎన్నికల్లోనూ బీద సోదరులకు చేతిచిలుం బాగానే వదిలింది. ఇంతకాలం పార్టీకి పనిచేయడం తప్ప పార్టీ పరంగా రవిచంద్ర పొందిందేమీ లేదు. కాని ఈసారి మాత్రం ఆయన బలమైన పదవుల మీదే కన్నేశారు. ఇస్తే టిటిడి ఛైర్మెన్ పదవి ఇవ్వండి, లేదంటే రాజ్యసభ ఇవ్వమని కోరుతున్నట్లు తెలుస్తుంది. ఎమ్మెల్సీ కోసం ఆయన ప్రయత్నాలు చేయడం లేదు. టిటిడి ఛైర్మెన్ ప్రాపబుల్స్‌లో చదలవాడ కృష్ణమూర్తి, గాలి ముద్దుకృష్ణమనాయుడు, కె.రాఘవేంద్రరావు, మురళీ మోహన్ వంటి వారితో పాటు రవిచంద్ర కూడా ఉన్నారు. వెంకన్న కరుణిస్తే రవిచంద్రకు ఆయన సేవ చేసుకునే అదృష్టం దక్కుతుంది. చంద్రబాబు కరుణిస్తే రాజ్యసభ యోగం పడుతుంది.

# నేతల్లో 'నుడా' ఆశలు








రాష్ట్ర ప్రభుత్వం నెల్లూరు అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటి(నుడా) ఏర్పాటుకు ప్రయత్నాలు చేస్తున్న నేపథ్యంలో ఈ సంస్థ ఛైర్మెన్ పదవికి అప్పుడే పోటీ మొదలైంది. 'నుడా' పరిధి చాలా విస్తృతం కానుంది. ఇప్పుడున్న నెల్లూరు కార్పొరేషన్‌తో పాటు చుట్టుపక్కల మరో 5మండలాలు నుడా పరిధిలో చేరుతాయి. 'నుడా' ఛైర్మెన్ అంటే మేయర్ పదవితో సమానం. అంతేకాక భవిష్యత్‌లో నెల్లూరు అభివృద్ధికి సంబంధించి కార్పొరేషన్ కంటే నుడాకే ఎక్కువ ప్రాధాన్యత ఉంటుంది. కేంద్ర పట్టణాభివృద్ధిశాఖ మంత్రిగా వున్న యం.వెంకయ్యనాయుడు చొరవతోనే నెల్లూరులో 'నుడా' ఏర్పాటు కానుంది. ప్రత్యేకించి నెల్లూరు అభివృద్ధి కోసం వెంకయ్యనాయుడే హడ్కో ద్వారా 1200కోట్ల రూపాయలు మంజూరు చేయించినట్లు సమాచారం. నిధుల సద్వినియోగానికి ఇప్పటికే నగరపాలక సంస్థకు ఐఏఎస్ కమిషనర్‌ను వేయించుకున్న వెంకయ్యనాయుడు 'నుడా' ద్వారా నగరాభివృద్ధిలోను ఆయన పేరును వినియోగించుకోనున్నారు.

కాగా 'నుడా' అనగానే ఛైర్మెన్ పదవిపై తెలుగుతమ్ముళ్ళు ఆశతో ఉన్నారు. మాజీ ఎమ్మెల్యే ముంగమూరు శ్రీధరకృష్ణారెడ్డి, మేయర్ అభ్యర్థిగా ఓడిపోయిన డాక్టర్ జడ్.శివప్రసాద్, దేశాయిశెట్టి హనుమంతరావు, కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి, చాట్ల నరసింహరావు, అనూరాధ, అంచల వాణి వంటి నాయకులు ఈ పదవికి రేసులో ఉన్నట్లు తెలుస్తుంది. ఎన్నికలకు ముందే శ్రీధరకృష్ణారెడ్డి తెలుగుదేశంలో చేరారు. నగర అసెంబ్లీ నుండి పోటీపడి కొంచెం భారీతేడాతోనే ఓటమి పాలయ్యారు. నగరానికి ఇన్‌ఛార్జ్‌గా వ్యవహరిస్తున్న ముంగమూరుకు ఈ పదవిపై మనసు పడింది. ఇక నగరపాలక సంస్థ ఎన్నికల్లో మేయర్ అభ్యర్థిగా బరిలోకి దిగి, పార్టీ అభ్యర్థులకు సొంత డబ్బును ఖర్చుచేసిన జడ్.శివప్రసాద్ పేరు కూడా ఈ పదవికి ప్రముఖంగా వినిపిస్తుంది. బలహీనవర్గాలకు చెందిన వ్యక్తి కావడం, విద్యావంతుడై వుండడం, దీనికితోడు కొంత సానుభూతి వుండడం కలిసొచ్చే అంశాలు. రాజకీయంగా సోమిరెడ్డి వద్ద శిష్యరికం చేసినప్పటికి పార్టీలో అందరితోనూ సన్నిహిత సంబంధాలున్నాయి. పార్టీలో పలు పదవులు నిర్వహించిన ఆయన పార్టీ ప్రతిపక్షంలో వున్న పదేళ్ళ కాలంలో పార్టీ పరంగా పెద్దఎత్తున ఉచిత వైద్యశిబిరాలను ఏర్పాటుచేసి ఆ విధంగా పార్టీని ప్రజల్లోకి తీసుకెళ్లగలిగాడు. అలాగే రెండుసార్లు ఎమ్మెల్సీగా పోటీచేసి ఓడిపోయి అన్ని విధాలా నష్టపోయిన దేశాయిశెట్టి హనుమంతరావు పేరు కూడా ప్రముఖంగా వుంది. మొన్నటి ఎన్నికల్లో నెల్లూరు నగరం సీటునాసించి భంగపడ్డ కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి కూడా ఈ పదవి ప్రయత్నాల్లో వున్నారు. అయితే ఆయన చంద్రబాబు కంటే బాలకృష్ణ మీద ఆశలు పెట్టుకుని ఉంటాడు. కాని చంద్రబాబు దృష్టిలో పడకపోతుండడం వల్లే ఆయనకు టైం కలసిరావట్లేదు. గత కాంగ్రెస్ ప్రభుత్వంలో పదేళ్ల పాటు ఆనం ఇలాకలో వుండి హవా సాగించిన చాట్ల నరసింహరావు ప్రస్తుతం మంత్రి నారాయణ ఆహ్వానం మేరకు తెలుగుదేశంలో చేరడం తెలిసిందే! నారాయణకు అత్యంత ముఖ్యుడు కావడంతో 'నుడా' ఛైర్మెన్ పదవికి ఆయన పేరు కూడా వినిపిస్తుంది. అయితే మొన్ననే పార్టీలో చేరిన చాట్లకు ఈ పదవినిస్తే పార్టీ వర్గాలలో వ్యతిరేకత వచ్చే అవకాశముంది.

మహిళల వైపునుండి చూస్తే మాజీ మున్సిపల్ ఛైర్‌పర్సన్ శ్రీమతి టి.అనురాధతో పాటు అంచల వాణి కూడా రంగంలో వుంది. అయితే చంద్రబాబు నామినేటెడ్ పదవుల విషయంలో చాలా జాగ్రత్తగా వ్యవహరించాలనుకుంటున్నట్లు తెలుస్తుంది. ఇటీవల పలు ఎన్నికల్లో పోటీ చేసి ఆర్థికంగా నష్టపోవడంతో పాటు ఎంతోకాలంగా పార్టీ జెండాలు మోసిన వారికే పదవులలో పెద్దపీట వేయాలని భావిస్తున్నారు.




## బెజవాడ గోపాలరెడ్డి అవార్డు సభకు
# అతిరథుల రాక

ఈ నెల 21వ తేదీ మధ్యాహ్నం 2.45గంటలకు నెల్లూరులోని కస్తూరిదేవి గార్డెన్స్‌లో జరిగే డాక్టర్ బెజవాడ గోపాలరెడ్డి అవార్డు ప్రదానోత్సవ సభకు అతిథులుగా అతిరథులు రానున్నారు. ప్రముఖ నిర్మాత, సినీనటులు పద్మశ్రీ డాక్టర్ యం.మోహన్‌బాబుకు ఈ అవార్డును అందజేయడానికి తమిళనాడు గవర్నర్ కె.రోశయ్య ముఖ్యఅతిథిగా వస్తున్నారు. రాజ్యసభ సభ్యులు టి.సుబ్బరామిరెడ్డి అధ్యక్షతన జరిగే ఈ సభలో మోహన్‌బాబు గురువు, దర్శకరత్న దాసరి నారాయణరావుతో పాటు శాంతా బయోటెక్నిక్స్ అధినేత కె.ఐ.వరప్రసాద్‌రెడ్డి, మాజీపార్లమెంటు సభ్యురాలు శ్రీమతి మాగుంట పార్వతమ్మ, ప్రముఖ పారిశ్రామికవేత్త వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, 'లాయర్' వారపత్రిక సంపాదకులు తుంగా శివప్రభాత్‌రెడ్డి పాల్గొంటారు. ఈ వేదికపైనే డాక్టర్ బెజవాడ గోపాలరెడ్డి గారి 'స్వీయ చరిత్ర' ఆధునీకరించబడిన ద్వితీయ ముద్రణ పుస్తకాన్ని కె.రోశయ్య ఆవిష్కరిస్తారు.

## వైయస్సార్సీపీ నగర అధ్యక్షుడిగా తాటి



వైయస్సార్సీపీ నగర అధ్యక్షుడిగా తాటి వెంకటేశ్వర్లు, నెల్లూరు నగర యువజన అధ్యక్షుడిగా గంథం సుధీర్‌బాబును నియమించినట్లు వైయస్సార్సీపీ జిల్లా అధ్యక్షుడు నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి తెలిపారు. వైయస్సార్సీపీ అధ్యక్షుడు వైయస్ జగన్మోహన్‌రెడ్డి ఆమోదంతో నియమించినట్లు తెలిపారు.



## ఏపి బాక్సింగ్ అసోసియేషన్
## ఉపాధ్యక్షుడిగా రవిప్రసాద్‌రెడ్డి

హైదరాబాద్‌లో ఇటీవల నవ్యాంధ్ర ప్రదేశ్ బాక్సింగ్ అసోసియేషన్ సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సమావేశంలో నూతన ఆంధ్రప్రదేశ్ బాక్సింగ్ అసోసియేషన్ కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నెల్లూరు జిల్లా బాక్సింగ్ అసోసియేషన్ జనరల్ సెక్రటరి సన్నపురెడ్డి రవిప్రసాద్‌రెడ్డిని నూతన ఆంధ్రప్రదేశ్ బాక్సింగ్ అసోసియేషన్ ఉపాధ్యక్షునిగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

# నెల్లూరు కబుర్లు

## బంగ్లా లేని జేసీ!



తనదైన చురుకుదనంతో పరిపాలనా వ్యవహారాలలో దూసుకుపోతున్న జిల్లా జాయింట్ కలెక్టర్ జి.రేఖారాణికి ఇంతవరకు బంగ్లా లేదు. ఆమె ఈ జిల్లాకు జాయింట్ కలెక్టర్‌గా వచ్చినప్పటి నుండి పినాకిని అతిథిగృహంలోనే ఉంటున్నారు. జాయింట్‌కలెక్టర్‌కు గతంలో శ్రీ రాజ రాజేశ్వరమ్మ గుడి సమీపంలో బంగ్లా ఉండేది. అదిప్పుడు బాగా పాతదైపోయింది. రేఖారాణి అందులోకి పోవడం ఇష్టంలేక పినాకిని అతిథిగృహంలోనే ఉంటున్నారు. ఒక మంచి బంగ్లా ఏర్పాటు చేస్తే ఆమె పినాకిని అతిథిగృహంను వీడాలనే ఆలోచనలో ఉన్నట్లు తెలుస్తుంది.



## శ్రీకాకుళంకు కమిషనర్

తుఫాను ప్రభావిత ప్రాంతాలలో శ్రీకాకుళం జిల్లాకు ప్రత్యేకాధికారిగా నెల్లూరు నగరపాలక సంస్థ కమిషనర్ చక్రధర్‌బాబును ప్రభుత్వం నియమించింది. అక్కడ సహాయక చర్యలలో పాల్గొనేందుకు ఆయన సోమవారమే నెల్లూరు నుండి బయల్దేరి వెళ్లారు.

## రక్తదాన శిబిరం



నెల్లూరు వాసవిక్లబ్, సత్యభామ శిల్ప్స్ సంయుక్త ఆధ్వర్యంలో సోమవారం సత్యభామ శిల్ప్స్ లో మెగా రక్తదాన శిబిరం జరిగింది. ఈ శిబిరానికి ముఖ్య అతిథిగా అడిషనల్ జాయింట్ కలెక్టర్ ఆర్ఎస్ రాజ్‌కుమార్, మాజీఎమ్మెల్యే ఆనం వివేకానందరెడ్డి, ఏ.సి.సుబ్బారెడ్డి, ఆనం రంగమయూర్‌రెడ్డి, రెడ్‌క్రాస్ కన్వీనర్ ఈదూరు సుధాకర్ పాల్గొని రక్తదానంకు యువత ముందుకు రావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సత్యభామ శిల్ప్స్ అధినేత గ్రంధి బాలకృష్ణ, అధ్యక్షుడు తిరివీధి కిషోర్, బ్లడ్‌మోటివేటర్ బయ్యా ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## జిల్లాలో పర్యటించనున్న
# పండిట్ రవిశంకర్ శిష్యబృందం

హిందూమత సంస్కృతిపై జరుగుతున్న దాడిని ఎదుర్కొంటూ హిందూ మతంలోని ఔన్నత్యాన్ని, హిందూ సంస్కృతి గొప్పతనాన్ని ప్రపంచం నలుమూలలా చాటుతూ ఆర్ట్ ఆఫ్ లివింగ్ వ్యవస్థాపకులు పండిట్ రవిశంకర్ గురూజీ శిష్యబృందం దేశవ్యాప్తంగా పర్యటిస్తున్నారు. ఈ బృందంలో విదేశీయులు కూడా ఉన్నారు. వీరంతా హిందూ సంస్కృతికి ఆకర్షితులై వచ్చినవారే! గురూజీ శిష్యబృందం ఈనెల 19 నుండి 24వరకు జిల్లాలోని పొట్టేపాలెం, పాటూరు, దామరమడుగు, నారాయణరెడ్డిపేట గ్రామాలతో పాటు మరో ఐదు గ్రామాల్లో పర్యటించనుంది. అన్యమత ప్రచారాలకు ఆకర్షితులై, ప్రలోభాలకు గురై మతం మారిన వారిని వీరు చైతన్య పరుస్తారు. వేదాలు, భారతీయ పురాణాలు, హిందూ సంస్కృతి గొప్పతనాన్ని గురించి విదేశీ ప్రతినిధులే వివరిస్తారు. ఎంతో గొప్పదైన మతాన్ని వదిలి దూరపుకొండలు నునుపు అన్నట్లుగా పరాయి మతం కోసం పరుగులు తీయొద్దని ఉప దేశించనున్నారని ఆర్ట్ ఆఫ్ లివింగ్ సభ్యులు కోట రమేష్‌బాబు ఒక ప్రకటనలో తెలిపారు.

## చేయూతనిచ్చేందుకు కదిలారు

హుదూద్ తుఫాన్‌తో తీవ్రంగా నష్టపోయిన విశాఖపట్నం, విజయనగరం, శ్రీకాకుళం జిల్లాల్లో సహాయక కార్యక్రమాలలో పాల్గొనేందుకుగాను సోమవారం నెల్లూరు నుండి 600మంది దాకా అధికారులు, సిబ్బంది కలిసివెళ్లారు. రెవెన్యూ, మున్సిపల్, ట్రాన్స్‌కో, సివిల్‌సప్లయ్ అధికారులు సిబ్బందితో పాటు రెడ్‌క్రాస్ సభ్యులు కూడా వాహనాలలో తరలివెళ్లారు. ఏజేసీ రాజ్‌కుమార్, తెలుగుగంగ స్పెషల్ కలెక్టర్ విజయచందర్, మెప్మా పి.డి ఏసు రత్నం, జడ్పీ సిఇఓ జితేంద్ర, జౌళి, చేనేత జేపీ బాబ్జీరావు తదితరులు ఈ బృందాలకు నేతృత్వం వహించారు.

**విశాఖకు కార్పొరేషన్ సిబ్బంది:** తుఫాన్ బాధితులకు సేవలందించేందుకు నెల్లూరు నగరపాలక సంస్థలోని వివిధ సెక్షన్‌ల అధికారులు, సిబ్బంది విశాఖపట్నంకు వెళ్లారు. శానిటరీ సూపర్ వైజర్ శివనాగేశ్వరరావుతో పాటు శానిటరీ ఇన్స్‌పెక్టర్లు మాల్యాద్రి, వెంకటేశ్వర్లు, కృష్ణారెడ్డిలు విశాఖకు వెళ్లినవారిలో ఉన్నారు.




శ్లో॥ నైనం ఛిందంతి శస్త్రాణి నైనం దహతి పావక: ॥
నచైనం క్లేదయంత్వాపో నశోషయతి మారుత: ॥ (గీత)

# ఉత్తరక్రియలు

మా ఇంటి దైవం
మా కంటిలో నిత్యం వెలిగే దీపం
మా తండ్రి గారైన

## శ్రీ కోటంరెడ్డి బేబిరెడ్డి గారు

తేది.10-10-2014, శుక్రవారం స్వర్గస్తులైనారు.

వారి పవిత్రాత్మకు శాంతిని చేకూర్చమని
భగవంతుని ప్రార్థిస్తూ...

కుమారులు

**కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి**
శాసనసభ్యులు, నెల్లూరురూరల్.

**కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి**

**ఉత్తరక్రియలు:** తేది. 25-10-2014, శనివారం ఉదయం 10గంటలకు, సంగం మండలం పడమటిపాలెం గ్రామంలోని మా స్వగృహము నందు జరుగును. కావున తెలియజేయడమైనది.

• చంద్రబాబు వచ్చారు... వెళ్లారు!

# మాటలు తప్ప చేతలేవీ?

ముఖ్యమంత్రి చంద్రబాబు జిల్లా పర్యటన నిష్ఫలంగా సాగింది. ఒకసారి శ్రీహరికోటలో వదిలే రాకెట్‌ను చూడడానికి, రెండోసారి వెంకటాచలం స్వర్ణభారత్ ట్రస్ట్‌లో జరిగిన స్వర్ణయాగం చూడడానికి వచ్చిన చంద్రబాబు మూడోసారి మాత్రం ప్రభుత్వ అధికారిక కార్యక్రమమైన జన్మభూమిలో పాల్గొనడానికి వచ్చాడు. ఒక ముఖ్యమంత్రి అధికారికంగా జిల్లాకు వస్తే ఆ ఊపు కనిపించాలి. జిల్లాలో అభివృద్ధి పనులపై కదలిక రావాలి. చంద్రబాబు వచ్చిపోయాక ఆ కదలికే కనిపించలేదు. జిల్లాలో వచ్చిన ఎన్నికల ఫలితాలు చంద్రబాబును నిరాశకు గురిచేశాయి. అందుకే నెల్లూరుపై పగబట్టినట్లుగా ఈ జిల్లాకు ఒక్క కేంద్ర సంస్థను కూడా ఇవ్వలేదు సరికదా ఈ జిల్లాలో పరిశ్రమలు పెడతామంటూ వచ్చిన వారిని కూడా వెనక్కు పంపేశాడు. కనీసం ఇప్పటికైనా ఆయన మనసు మారిందా అనుకుంటే, ఆ ఆనవాళ్లే కనిపించడం లేదు.



జిల్లాలో సాగునీటి ప్రాజెక్టుల పూర్తికి చంద్రబాబు ఎటువంటి హామీ ఇవ్వలేదు. నెల్లూరు బ్యారేజ్, సంగం బ్యారేజీ పనులతో పాటు డెల్టా ఆధునీకరణ పనులు నత్తనడకన సాగుతున్నాయి. కోస్తా కారిడార్ గురించి పీఎం చెప్పాల్సిందేమీ లేదు, పరిశ్రమల పరంగా ఈ కారిడార్‌లో నెల్లూరు జిల్లాకు ప్రాధాన్యత లేకుండా చేశారు. పారిశ్రామికంగా జిల్లా అభివృద్ధికి ఆయన నిర్దిష్ట హామీలేవీ ఇవ్వలేదు. ఇఫ్కో కిసాన్ సెజ్ కోసమని రాచర్లపాడు వద్ద 6వేల ఎకరాల భూమిని సేకరించిపెట్టారు. దీనిని ఏమి చేస్తారో చెప్పలేదు. దామవరం వద్ద ఎయిర్‌పోర్టుకు స్థలసేకరణ జరిగివుంటే చంద్రబాబు ఊహించని విధంగా వెంకటగిరిలో ఎయిర్‌పోర్టు కట్టిస్తానని అయోమయానికి గురిచేశాడు. 30కిలోమీటర్ల దూరంలో రేణిగుంట ఎయిర్‌పోర్టు వుంటే మళ్లీ ఇక్కడ ఎయిర్‌పోర్టు ఎందుకనేది ఎవరికీ అర్థం కాలేదు. ఎందుకంటే ఇంత దగ్గరలో ఒక మోస్తరు బస్టాండ్ కూడా లేదు. జిల్లాను పర్యాటక రంగంలో అభివృద్ధి చేస్తానని ఆయన హామీ ఇచ్చారు. గతంలో సీఎంగా వున్నప్పుడు కూడా చంద్రబాబు జిల్లాలో పర్యాటక అభివృద్ధికి హామీలిచ్చారు. కాని ఆచరణ మాత్రం శూన్యం. ఈ పర్యటనలో జిల్లాలో శాశ్వత అభివృద్ధికి చంద్రబాబు ఇచ్చిన నిర్దిష్ట హామీలేమీ లేవు. కేవలం జన్మభూమి షోగా చంద్రబాబు పర్యటన ముగిసింది.

# ప్రతి గ్రామానికి పోలీసు కానిస్టేబుల్

- ఎస్పీ సెంథిల్‌కుమార్



జిల్లాలోని ప్రతి గ్రామంలో పోలీసుకానిస్టేబుల్‌ని ఏర్పాటు చేస్తున్నట్లు ఎస్పీ సెంథిల్‌కుమార్ తెలిపారు. గూడూరులోని డిఎస్పీ కార్యాలయంలో ఆయన డివిజన్‌లోని సిఐలు, ఎస్సైలతో నేరాలపై సమీక్షా సమావేశాన్ని మంగళవారం నిర్వహించారు. ప్రతి రెండు గ్రామాలకు కానిస్టేబుల్‌ను ఏర్పాటుచేసి ఆ గ్రామాలలో ఏవైనా నేరాలు, ప్రమాదాలు జరిగితే వెంటనే ఆ సమాచారాన్ని మాకు అందేలా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. పోలీసుస్టేషన్లలో కూడా గ్రామాల సమాచారం పూర్తిగా ఉండాలని, ఎస్సై మారినా సమాచారం ఉండే విధంగా చూడాలన్నారు. బెల్టు దుకాణాలు ఇంకా కొన్ని ఉన్నాయని సమాచారం ఉందని, వాటిని కూడా లేకుండా చేస్తామన్నారు. నేరాల నియంత్రణకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని తెలిపారు. కేసులను ఎలా విచారణ జరపాలి, నిందితులకు శిక్షపడేలా దర్యాప్తు తీరు ఎలా వుండాలో సూచించారు. పోలీసుల పనితీరును బట్టి రివార్డులుంటాయని, లేకపోతే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. చాలాకాలంగా పలు కేసులు పెండింగ్‌లో ఉన్నాయని, వాటిని వెంటనే పూర్తిచేయాలని, ఎస్సీ, ఎస్టీ కేసులు త్వరితగతిన పూర్తిచేయాలన్నారు. డిఎస్పీ కొత్తగా రావడంతో డివిజన్ స్థాయి సమీక్షాసమావేశం ఎస్పీ ఏర్పాటు చేశారు. ఈ సమావేశంలో డిఎస్పీ శ్రీనివాస్, సిఐలు, ఎస్సైలు తదితరులు పాల్గొన్నారు.

# ఆక్రమణపై వేటుపడింది

## పట్టుబట్టి తొలగించిన కార్పొరేటర్ బొబ్బల శ్రీనివాసయాదవ్



నెల్లూరు నగరంలో ఆక్రమణలకు అడ్డు అదుపు లేదు. ఆక్రమణలు తొలగించడానికి శ్రీకారం చుడితే కార్పొరేషన్ అధికారులు, సిబ్బందికి తిండి తినడానికి కూడా తీరిక దొరకదు. నగరం మొత్తంమీద ఎలా ఉన్నా తన డివిజన్ పరిధిలో వున్న ఆక్రమణల తొలగింపుకు శ్రీకారం చుట్టాడు 37వ డివిజన్ కార్పొరేటర్ బొబ్బల శ్రీనివాసయాదవ్. నెల్లూరు దర్గామిట్టలో జిఎన్‌టి రోడ్డుపక్కనే మున్సిపల్ మురుగు కాలువను ఆక్రమించుకుని కట్టిన ఓ హోటల్ అక్రమనిర్మాణాన్ని ఈనెల11వతేదీన తొలగించారు. గత కార్పొరేషన్ పాలక వర్గం హయాంలో 'లియో' హోటల్ యాజమాన్యం కాలువను ఆక్రమించింది. ఆరోజు ఇది అక్రమం, అన్యాయమంటూ పత్రికలతో పాటు అందరూ ఘోషించినా కార్పొరేషన్ పాలకులు చెవికెక్కించుకోలేదు. కాలువను ఆక్రమించి హోటల్ గోడను కట్టినందువల్ల ఇక్కడ రోడ్డు ఇరుకుగా మారింది. కాలువను ఆక్రమించడంతో ఎక్కడి మురుగు అక్కడే నిలిచిపోయి డ్రైనేజీ ఇబ్బందులు తలెత్తసాగాయి. స్థానిక ప్రజల బాధను అర్థం చేసుకున్న కార్పొరేటర్ శ్రీనివాసయాదవ్ ఈ విషయాన్ని కమిషనర్ దృష్టికి తీసుకెళ్లారు. కార్పొరేటర్ సమక్షంలోనే ఈ నెల 11న నగరపాలక సంస్థ టౌన్‌ప్లానింగ్ సిబ్బంది ఈ ఆక్రమణను తొలగించింది. ఆక్రమణలు ఎక్కడున్నా, ఎవరివైనా తొలగించాల్సిందే! అయితే ఆక్రమణల తొలగింపు ఒకటి రెండు కట్టడాలకే పరిమితమైతే అది రాజకీయ కోణంలోకి వెళుతుంది. ఆక్రమణలన్నింటిపై కొరడా ఝుళిపిస్తేనే నిష్పాక్షికంగా వ్యవహరిస్తున్నారనే పేరొస్తుంది.

# కావలిలో జగన్నాథుని రథయాత్ర



హరే రామ! హరే రామ! రామ రామ హరే హరే!..హరే కృష్ణ! హరే కృష్ణ! కృష్ణ కృష్ణ హరే హరే!.. అంటూ ఆ భగవంతుని నామస్మరణలతో కావలి మార్మోగింది. మేళ తాళాల మధ్య, మంగళవాయిద్యాల మధ్య, భక్తుల కోలాటాలు, భజనల మధ్య శ్రీ జగన్నాథుని రథయాత్ర ఆద్యంతం కోలాహలంగా సాగింది.

నెల్లూరు ఇస్కాన్ సంస్థ ఆధ్వర్యంలో, కావలి పట్టణంలో ఈ నెల 11వ తేదీన శ్రీ జగన్నాథ రథయాత్ర నిర్వహించారు. లోకకళ్యాణం కోసం నిర్వహించే ఈ రథయాత్ర భక్తులందరినీ విశేషంగా ఆకట్టుకుంది. తొలుత, బృందావన కాలనీలోని శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయం వద్ద నుంచి రథయాత్ర బయలుదేరి అయిదు లాంతర్ల కూడలి, కృష్ణుని విగ్రహం కూడలి, పాతవూరు పోలేరమ్మ అరుగు, శివాలయం, ట్రంకురోడ్డు మీదుగా ఆర్ఎస్ఆర్ కళ్యాణమండపానికి చేరుకుంది. అత్యంత సుందరంగా రూపుదిద్దిన రథంపై, అనేకానేక సుగంధభరిత పుష్పాలతో, స్వర్ణకాంతులీనే దివ్యాభరణాలతో శోభాయమానంగా అలంకృతులైన శ్రీ జగన్నాథుడు, బలదేవ్, సుభద్రాదేవిల దివ్యమంగళ విగ్రహాలను రథంపై వేంచేపు జేసి, వైభవోపేతంగా స్వామివార్లకు రథయాత్ర నిర్వహించారు. వేలాదిమంది భక్తులు ఈ రథయాత్రలో పాల్గొని స్వామివార్లను దర్శించుకుని తరించారు. హరే రామ! హరే కృష్ణ అంటూ రథయాత్ర పొడవునా భక్తులు భక్తిపారవశ్యంతో తన్మయులయ్యారు. చిన్నారుల నృత్యాలతో, వివిధ దేవతామూర్తుల వేషధారణలతో, ఒంటెలు, కీలుగుర్రాలతో, కోలాటాలు-భజనలతో, శ్రీ కృష్ణ చైతన్యసంఘంవారి భక్తిగానాలతో, బాణసంచా వేడుకలతో సాగిన జగన్నాథుని రథయాత్రతో కావలి దద్దరిల్లింది. ఈ రథయాత్రను కనులారా తిలకించి పులకించిపోయేందుకు భక్తజనం పోటెత్తింది. అందులోనూ శ్రీ జగన్నాథుని రథయాత్ర కావలిలో జరగడం ఇదే ప్రథమం కావడంతో భక్తులు వెల్లువలా తరలివచ్చారు. రథం లాగేందుకు తోసుకునివచ్చి పోటీపడ్డారు. నగర ప్రముఖులు, నాయకులు, పెద్దసంఖ్యలో భక్తులు రథయాత్రకు వచ్చి, రథారూఢులైన స్వామివార్లను దర్శించుకుని ఆనంద తరంగిత హృదయులయ్యారు. ఈ రథయాత్రలో నెల్లూరు ఎంపి మేకపాటి రాజమోహన్‌రెడ్డి, జడ్పీ ఛైర్మన్ బొమ్మిరెడ్డి రాఘవేంద్రరెడ్డి, కావలి ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే, రాష్ట్ర రాజధాని నిర్మాణ కమిటీ సభ్యులు బీద మస్తాన్‌రావు, మునిసిపల్ ఛైర్పర్సన్ అలేఖ్య, వైస్ ఛైర్మన్ గుండ్లపల్లి భరత్‌కుమార్‌యాదవ్, బృందావనం హౌసింగ్ కాలనీ వ్యవస్థాపక అధ్యక్షులు శ్రీరాం మాల్యాద్రి, మునిసిపల్ మాజీ ఛైర్మన్ గ్రంధి యానాదిశెట్టి తదితర ప్రముఖులతో పాటు ఇస్కాన్ నిర్వాహకులు, ధార్మిక ప్రముఖులు, ఆర్ఎస్ఎస్, విశ్వహిందూ పరిషత్ నాయకులు పాల్గొన్నారు.

# సత్యంజీ ఆధ్వర్యంలో స్వచ్ఛభారత్



స్వచ్ఛభారత్ కార్యక్రమంలో భాగంగా సత్యంజీ గ్రూప్ సభ్యులు ఈ నెల 14వ తేదీ నెల్లూరు చింతారెడ్డిపాలెంరోడ్డులోని చిల్డ్రన్స్ పార్కు రోడ్డుకు ఇరువైపులా క్లీన్ అండ్ గ్రీన్ కార్యక్రమాన్ని చేపట్టారు. మునిసిపాలిటీ వారు అందజేసిన 250మొక్కలను ముత్తుకూరు సెంటర్ నుండి హైవే వరకు నాటారు. ఈ కార్యక్రమంలో సత్యంజీ గ్రూపు అధినేత గోపిశెట్టి సత్యనారాయణ, ఆఫీసు సిబ్బంది, మార్కెటింగ్ మెంబర్లు పాల్గొని జన్మభూమి కార్యక్రమంగా చెట్లు నాటారు. ఈ సందర్భంగా సత్యంజీ మాట్లాడుతూ ప్రతి మంగళవారం ఉదయం 8గంటల నుండి 10గంటల వరకు సత్యంజీ గ్రూపు వారిచే స్వచ్ఛభారత్ కార్యక్రమాన్ని నిర్వహిస్తామని తెలిపారు.






## గూడూరు డివిజన్ వార్తలు

# చట్టాన్ని అతిక్రమిస్తే చర్యలు తప్పవు

**- డిఎస్పీ బి.శ్రీనివాస్**



చట్టాన్ని అతిక్రమిస్తే ఎంతటివారి పైనైనా చర్యలు తప్పవని గూడూరు డిఎస్పీ బాడిపల్లి శ్రీనివాస్ అన్నారు. గూడూరు డిఎస్పీగా 12వ తేదీ ఆయన బాధ్యతలు స్వీకరించారు. ముందుగా పూజా కార్యక్రమాలను కార్యాలయంలో నిర్వహించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తన సొంత ఊరు అనంతపురం అని, రేణిగుంట డిఎస్పీగా పనిచేసేటప్పుడు ఎర్రచందనం స్మగ్లర్లపై కఠినంగా వ్యవహరించానని, ఇక్కడ కూడా అదే ధోరణిలో పనిచేస్తానని తెలిపారు. గూడూరు డివిజన్‌లో జాతీయ రహదారి ఎక్కువుగా వుందని, రోడ్డు ప్రమాదాలు కూడా ఎక్కువగా జరుగుతున్నాయని, వీటిని నివారించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. పట్టణంలో ఆటోల దూకుడు తగ్గిస్తామని, ఆటోలకు నంబర్ల స్టిక్కరింగ్ కాకుండా పెయింట్‌తో వేయిస్తామని తెలిపారు. చోరీసొత్తు రికవరిపై దృష్టి సారిస్తామన్నారు. అందరి సహకారంతోనే నేరాలు అదుపు చేయగలమని తెలిపారు.

# వైకాపా బలోపేతానికి కృషి చేస్తా

**- వాటంబేటి శివకుమార్**



శివకుమార్‌ను అభినందిస్తున్న ఎల్లసిరి గోపాల్‌రెడ్డి, నాయకులు, కౌన్సిలర్లు తదితరులు

వైకాపా బలోపేతానికి తనవంతు కృషి చేస్తానని నూతనంగా ఎన్నికైన ఆ పార్టీ గూడూరు పట్టణ అధ్యక్షుడు వాటంబేటి శివకుమార్ తెలిపారు. గూడూరు రెండో పట్టణంలోని నరసింగరావుపేటలో ఉన్న వైకాపా రాష్ట్ర నేత ఎల్లసిరి గోపాల్‌రెడ్డి నివాసంలో 13వ తేదీ ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు ఆయన్ని అభినందించారు. ఈ కార్యక్రమంలో ఆ పార్టీ రాష్ట్ర నేత ఎల్లసిరి గోపాల్‌రెడ్డి, నాయకులు నాశిన నాగులు, శ్రీకాంత్‌రెడ్డి, గిరి, ఇస్మాయిల్, కౌన్సిలర్లు తదితరులు పాల్గొన్నారు.



# దాతృత్వంలో హీరోలతో పోటీ పడుతున్న భామలు

సినిమాలలో హీరోలతో పోటీపడి నటించడమే కాదు... మానవత్వంలోనూ వారితో పోటీ పడగలమని మన హీరోయిన్లు నిరూపించారు. హుదూద్ తుఫాన్ ధాటికి కకావికలమైన బాధితుల పట్ల మన హీరోయిన్లు తమ ఉదారతను చాటుకున్నారు. బాధితుల సహాయార్థం ప్రముఖ హీరోయిన్‌లు సమంత 10లక్షల రూపాయలు, కాజల్ అగర్వాల్ 5లక్షల రూపాయల విరాళం అందజేశారు. అలాగే 'లౌక్యం' ఫేం రకుల్‌ప్రీత్‌సింగ్, 'ఊహలు గుసగుసలాడే' ఫేం రాశి చెరో లక్ష రూపాయలు ప్రకటించారు. ఇంకా ఎంతో మంది ఇదే బాటలో నడవడానికి సిద్ధమవుతున్నారు.

## మూ'వీ'క్షణం

## మారని వ(ఖ)ర్మ



ఎప్పుడూ వివాదాలను నెత్తిన పెట్టుకుని తిరిగే రామ్‌గోపాల్‌వర్మ మరోసారి తన నోటిదురుసును చూపారు. తుఫాన్ బాధితులకు విరాళాలందించిన హీరోలపై ఆయన వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. కోట్లరూపాయల రెమ్యూనరేషన్ తీసుకునే హీరోలు లక్షల్లో విరాళాలివ్వడం చూసి షాక్ తిన్నాడట! మరి ఈయన ఎంత ఇవ్వబోతున్నాడో?

## 31న 'కరెంట్‌తీగ'

మంచు మనోజ్ హీరోగా రకుల్‌ప్రీత్‌సింగ్ హీరోయిన్‌గా, సన్నీలియోన్, జగపతిబాబు ప్రధాన పాత్రల్లో రూపొందిన 'కరెంట్‌తీగ' ఈ నెల 31న విడుదల కోబోతుంది.



# నిరుపేదలకే ప్రభుత్వ భూములు

గూడూరు మండలంలోని నెర్నూరు గ్రామంలో వున్న పాఠశాలలో 13వ తేదీ జరిగిన 'జన్మభూమి-మాఊరు' కార్యక్రమాన్ని తహశీల్దార్ వెంకటనారాయణమ్మ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ పాల్గొని ప్రసంగిస్తూ నియోజకవర్గంలోని కబ్జాదారులు ప్రభుత్వ భూములను ఆక్రమించి యథేచ్ఛగా సాగు చేసుకుంటున్నారని, వాటిని స్వాధీనం చేసుకొని తక్షణమే సెంటు భూమి లేని పేదలకు పంపిణీ చేయాలన్నారు. వివిధ కారణాలతో తొలగించిన పింఛన్లపై సర్వే జరిపి అర్హులైన వారి జాబితాను తయారు చేసి పంపిణీ చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్‌డబ్ల్యూఎస్ గృహనిర్మాణ శాఖ ఏఇలు అజీమ్, చంద్ర శేఖరరాజు, జడ్పీటీసీసభ్యులు పద్మ, మండల ఉపాధ్యక్షురాలు మట్టం శ్రావణి, సర్పంచ్ బుజ్జా నాగేశ్వరరావు, వైకాపా నాయకులు నెలబల్లి భాస్కర్‌రెడ్డి, మల్లు విజయకుమార్‌రెడ్డి, పిట్టి నాగరాజు, మధురెడ్డిలు పాల్గొన్నారు.



వృద్ధులకు పింఛన్లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్, ప్రక్కన తహశీల్దార్ వెంకటనారాయణమ్మ తదితరులు


# పోలీసు అమరవీరుల సంస్మరణ దినం

దేశ రక్షణ కోసం ప్రాణాలే అర్పించారు...

అక్టోబర్ 21

శాంతి సౌభాగ్యాల కోసం మీ రక్తాశ్రువులు ధారపోసారు.



ఎస్.సెంథిల్‌కుమార్
సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్
ఎస్‌పిఎస్‌ఆర్ నెల్లూరుజిల్లా.



మీ త్యాగనిరతికి ఇదే మా నివాళి.



రెడ్డి గంగాధర్
అదనపు సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్
ఎస్‌పిఎస్‌ఆర్ నెల్లూరుజిల్లా.



బి.శ్రీనివాస్
సబ్‌డివిజనల్ పోలీస్ అధికారి, గూడూరు.
మరియు సిబ్బంది
సబ్ డివిజనల్ పోలీస్ - గూడూరు


# ఫోటో వీడియోగ్రాఫర్స్ నూతన కార్యవర్గం



సమావేశంలో మాట్లాడుతున్న ఛైర్‌పర్సన్ పొనకా దేవసేన

గూడూరు పట్టణ, గ్రామీణ ప్రాంతాలకు చెందిన ఫోటోగ్రాఫర్స్ నూతన కార్యవర్గాన్ని 12వ తేదీ ఎన్నుకున్నారు. పట్టణంలోని అంబేద్కర్ భవనంలో నిర్వహించిన సమావేశంలో ఆ సంఘ రాష్ట్ర అధ్యక్షుడు దొంతి శ్రీధర్ నూతనంగా ఎన్నికైన అధ్యక్ష, కార్యదర్శులు గజానన గణపతినాయుడు, సాయివీరేంద్రనాథ్, ఉపాధ్యక్షుడు సలీం, సంయుక్త కార్యదర్శి హరిప్రసాద్, కోశాధికారి సయ్యద్ సలీంలతో ప్రమాణస్వీకారం చేయించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన మున్సిపల్ ఛైర్‌పర్సన్ పొనకా దేవసేన, శివకుమార్‌రెడ్డి దంపతులు సీనియర్ ఫోటోగ్రాఫర్లను సన్మానించారు. సంఘ కార్యాలయ భవన నిర్మాణం కోసం స్థలం కేటాయించాలని, ఫోటోగ్రాఫర్లు అందరికీ ఇళ్లస్థలాలు ఇప్పించాలని వారు ఈ సందర్భంగా ఛైర్‌పర్సన్‌ను కోరారు.

ఈ కార్యక్రమంలో శ్రీ సాయి సత్సంగ నిలయం ప్రధానకార్యదర్శి కోట సునీల్ కుమార్, గౌరవాధ్యక్షుడు కె.మునిగిరీష్, ఫోటోగ్రాఫర్లు పాల్గొన్నారు.

## మేషం



అశ్వని, భరణి, కృతిక 1 పాదము

బంధువర్గం వల్ల స్వల్ప సమస్యలుంటాయి. ఉద్యోగులు విధి నిర్వహణలో జాగ్రత్తగా ఉండాలి. విమర్శలకు పోటీపడవద్దు. ఆర్థికంగా బాగుండినా ఖర్చులు పెరుగుతాయి. ఆరోగ్య విషయంలో శ్రద్ధ చూపండి. అనుకున్న పనులు నిదానంగా జరగడం వల్ల టెన్షన్ ఎక్కువగా ఉంటుంది. స్థిరాస్తుల వ్యవహారాలు వాయిదా వేసికొనడం మంచిది.

## కన్య



ఉత్తర 2, 3, 4 పాదాలు, హస్త, చిత్త 1, 2 పాదాలు

ఉద్యోగులపై ప్రభుత్వ, పబ్లిక్ వత్తిడి ఎక్కువగా ఉంటుంది. బంధువర్గం రాకపోకలుంటాయి. శుభకార్య నిర్ణయాలలో అనుకూలత ఉంటుంది. వృత్తి ఉద్యోగ వ్యాపారాలలో కొంత అయిష్టంగానే పనులు చేయవలసి వస్తుంది. ఖర్చులు మోతాదు పెరిగినా ఆర్థిక ఇబ్బందులుండవు. ఇతరుల పనులకు సహాయపడటం, స్థిరాస్తుల వ్యవహారాలు, కోర్టు వ్యవహారాలు వాయిదాపడతాయి.

## వృశ్చికం



విశాఖ 4 పాదం, అనూరాధ, జ్యేష్ఠ

పెట్టుబడులకు, భాగస్వామ్య వ్యాపారాలకు అవకాశాలు, ఆహ్వానాలుంటాయి. శుభకార్య నిర్ణయాలలో సానుకూలత కనబడుతుంది. దూరప్రయాణాలుంటాయి. మాటలలో గాని వ్యవహారాలలో గాని తొందరపాటు ఎక్కువగా ఉంటుంది. వృత్తి వ్యాపారాలలో ఒక మోస్తరుగా అభివృద్ధి, రాబడి ఉంటుంది. ఇతరులకు ధన, వస్తు రూపంలో సహాయం చేస్తారు.

## వృషభం



కృతిక 2, 3, 4 పాదాలు, రోహిణి, మృగశీర్ష1, 2పాదాలు

దూర ప్రయాణాలుంటాయి. ప్రముఖులను పెద్దలను కలుసుకొని జరగబోవు కార్యములను నిర్ణయిస్తారు. వృత్తి వ్యాపారాలు సంతృప్తిగా జరిగి ఆదాయ లోపం ఉండదు. మంచి ఆర్థికాభివృద్ధి అవకాశాలు దొరుకుతాయి. అనుకున్న పనులను ఆటంకాలుండినా పట్టుదలతో విజయవంతంగా నిర్వహిస్తారు. కుటుంబసౌఖ్యం బాగుంటుంది. విద్యాప్రగతి బాగుంటుంది.



**బ్రహ్మశ్రీ స్వయంపాకుల శ్రీనివాసులు**
బాలాజీనగర్, నెల్లూరు

# రాశి - మీ వాసి

తేది. 17.10.2014 నుండి
తేది. 23.10.2014 వరకు

మీనంలో కేతువు, కర్కాటకంలో గురువు, కర్కాటక సింహ కన్య రాశులలో చంద్రుడు, కన్యలో రవి బుధ రాహువులు, 18వ తేదీ తులలో రవి, 19వ తేదీ తులలో శుక్రుడు, తులలో శని, వృశ్చికంలో కుజుడు, 18వ తేది ధనుస్సులో కుజుడు సంచరిస్తారు.

**పంచాంగము:**

తేది 22 బుధవారము సూర్యోదయానికి ముందు నరకచతుర్దశి
తేది 23 గురువారము దీపావళి అమావాస్య
శుక్రమౌఢ్యమి జరుగుచున్నది.

**ఆశ్వయుజ మాస కృష్ణపక్ష తిథులు**

| | | | |
|---|---|---|---|
| తేది. 17 | శుక్ర | నవమి | సా॥గం.4.23ని॥ |
| తేది. 18 | శని | దశమి | రా॥గం.6.24ని॥ |
| తేది. 19 | ఆది | ఏకాదశి | రా॥గం.8.34ని॥ |
| తేది. 20 | సోమ | ద్వాదశి | రా॥గం.10.36ని॥ |
| తేది. 21 | మంగళ | త్రయోదశి | రా॥గం.12.23ని॥ |
| తేది. 22 | బుధ | చతుర్దశి | రా॥గం.1.51ని॥ |
| తేది. 23 | గురు | అమావాస్య | రా॥గం.2.48ని॥ |

## ధనుస్సు



మూల, పూర్వాషాఢ, ఉ.షాఢ 1 పాదము

సోదరులతో విభేదాలు రావచ్చును. ఆర్థిక నిర్ణయాలలో శక్తి చాలక ఇతరుల సలహాను కోరతారు. శరీరానికి గాయాలు తగలవచ్చును. బంధువర్గం వల్లగాని, బిడ్డల వల్ల గాని ఇబ్బందులుంటాయి. వృత్తి వ్యాపారాలలో సామాన్య వృద్ధి, సామాన్య ఆదాయముంటుంది. స్థిరాస్తుల క్రయవిక్రయాలు కొంతకాలం ఆపుట మంచిది. గృహ వాహన వస్తు రిపేర్లుంటాయి.

## మిథునం



మృగశీర్ష 3,4 పాదాలు, ఆర్ద్ర, పునర్వసు 1, 2, 3పాదాలు

ఉద్యోగ వ్యవస్థలో గుర్తింపు గౌరవాలు, అధికారులకు స్థానమార్పు ఉంటుంది. నూతన సదుపాయాలు ఏర్పరచుకొంటారు. అవసరాలకు ముఖ్య పనులకు ఋణం చేయవలసి వస్తుంది. వ్యాపార విస్తరణ అవకాశాలు సన్నగిల్లుతాయి. ఆస్తి వ్యవహారాలు వాయిదా వేయండి. వృత్తివ్యాపారాలలో సామాన్య ఆదాయం ఉంటుంది. అనవసర విషయాలకు దూరంగా ఉండండి.

## మకరం



ఉ.షాఢ 2, 3, 4 పాదాలు, శ్రవణ, ధనిష్ఠ 1, 2 పాదాలు

ఆదాయము సామాన్యంగా ఉంటుంది. వస్తు వాహన గృహ రిపేర్లుంటాయి. స్త్రీలకు పిల్లలకు అనారోగ్య బాధలుంటాయి. కార్యసాధకులై పనులు చక్కబెడతారు. మీతో విభేదించినవారే మీకు సన్నిహితము కాగలరు. శుభకార్య పథకాలు నిర్ణయం కాగలవు. ముఖ్యపత్రాలు, వస్తువులు పదిలపరచుకొనండి. విద్యాప్రగతి బాగుంటుంది. ఆరోగ్యం బాగుంటుంది.

## కర్కాటకం



పునర్వసు 4 పాదం, పుష్య, ఆశ్లేష

దూరప్రయాణాలు జరుపవలసి వస్తుంది. కమిటీ సమావేశాలలో మీ సలహాలకు గుర్తింపు, పలుకుబడి బాగుంటుంది. చేపట్టిన పనులు విజయవంతంగా పూర్తి చేస్తారు. కుటుంబసభ్యుల సహకారం బాగుంటుంది. ఆదాయము ఖర్చులు సరిపోతుంటాయి. పెట్టుబడులకు, భాగస్వామ్య వ్యాపారాలకు అవకాశాలు లభించగలవు. బాకీలు, కోర్టు వ్యవహారాలలో అనుకూలత ఉంటుంది.

## కుంభం



ధనిష్ఠ 3, 4 పాదాలు, శతభిష, పూ.భాద్ర 1,2,3 పాదాలు.

కోర్టు వ్యవహారాలు వాయిదా పడతాయి. చెల్లింపులు, బ్యాంకు పనులందు జాగ్రత్త అవసరం. కుటుంబసభ్యుల అనుకూలత సరిగా ఉండదు. వృత్తి వ్యాపారాలలో అంతగా వృద్ధి ఉండదు. ఆదాయం తగ్గుతుంది. ఖర్చులు అదనంగా పెరుగుతాయి. బంధువర్గంతో గాని మిత్ర వర్గంతోగాని విభేదాలు రావచ్చును. అవివాహితులకు, నిరుద్యోగులకు మంచి జరగడానికి అనుకూల సమయం. ఆరోగ్యం బాగుంటుంది.

## సింహం



మఖ, పుబ్బ, ఉత్తర 1పాదము

శుభకార్యముల విషయంలో కాలయాపన జరుగుతుంది. స్థిరాస్తుల లావాదేవీలు లాభదాయకంగా ఉంటాయి. విమర్శలకు దూరంగా ఉండండి. ప్రయాణాలుంటాయి జాగ్రత్తపడాలి. పట్టుదలతో నిర్ణయాలు చేసి ఇబ్బందులు పడకుండా చూచుకొనండి. వృత్తి వ్యాపారాలలో స్వల్పంగా అభివృద్ధి ఆదాయం ఉంటుంది. కుటుంబ ఖర్చులు పెరుగుతాయి.

## తుల



చిత్త 3, 4 పాదాలు, స్వాతి, విశాఖ 1, 2, 3 పాదాలు

వృత్తి వ్యాపారాలలో ఆర్థికావకాశాలు చేజారిపోవచ్చును. ఆదాయం తగ్గుతుంది. ఉద్యోగులకు పనిభారం స్థానమార్పులు, పబ్లిక్‌తో ఇబ్బందులుంటాయి. పరుషంగా మాట్లాడటం, మొండిగా ప్రవర్తించడం వల్ల ఇబ్బంది పడతారు. ఆర్థిక వ్యవహారాలలో సరైన నిర్ణయాలు చేయలేక ఇబ్బంది పడతారు. శుభకార్య ప్రయత్నాలు ముమ్మరంగా జరుపుతారు.

## మీనం



పూర్వాభాద్ర 4 పాదం, ఉ.భాద్ర, రేవతి

గృహ వస్తు వాహన రిపేర్లుంటాయి. బంధువర్గంలో అనారోగ్య బాధలుంటాయి. ప్రభుత్వ అనుమతులు పొందుతారు. రాబడి ఖర్చులు సరిపోతుంటాయి. నిరుద్యోగులకు, వృత్తి జీవనం గలవారికి అవకాశాలు బాగుంటాయి. వ్యాపారవర్గాలు కొత్త ప్రయత్నాలు పథకాలతో అభివృద్ధికి కృషి చేస్తారు. ఆరోగ్య విషయంలో శ్రద్ధ అవసరం. విద్యాప్రగతి బాగుంటుంది.

# పింఛన్ విషయంలో విమర్శలు తగవు

పింఛన్ విషయంలో ప్రతిపక్ష పార్టీ నాయకులు విమర్శలు చేయడం తగదని తెలుగుదేశంపార్టీ నాయకుడు కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి అన్నారు. సోమవారం టిడిపి జిల్లా కార్యాలయంలో విలేకర్లతో ఆయన మాట్లాడుతూ టిడిపి హయాంలో అర్హులందరికి పింఛన్ అందుతుందన్నారు. నెల్లూరుజిల్లాలో 2,58,804 పింఛన్లు ఉండగా 37,414 పింఛన్లు రద్దయ్యాయని తెలిపారు. కమిటీల పరిశీలన అనంతరం 2,721 పింఛన్లు మంజూరు చేసినట్లు తెలిపారు. వయస్సు ఆధార్ కార్డుల్లో తప్పుల వల్ల ఆగిపోయాయన్నారు. అర్హులకు పింఛన్ మంజూరుకు గ్రామ, మండలస్థాయిల్లో కమిటీలు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో ధర్మవరం సుబ్బారావు, ఉచ్చి భువనేశ్వర ప్రసాద్, పడవల కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

# బీజేపీలోకి కళాకారులు

కళాకారుల సమస్యల పరిష్కారం బీజేపీతోనే సాధ్యమని పార్టీ జిల్లా సాంస్కృతిక సెల్ కన్వీనర్ కళాంజలి శ్రీనివాస చక్రవర్తి పేర్కొన్నారు. సోమవారం ప్రెస్‌క్లబ్‌లో ఆయన విలేకర్లతో మాట్లాడుతూ దేశంలో మోడీ ప్రభుత్వం రావాలని సినీ, టివి రంగాలకు చెందిన ప్రముఖనటీనటులు బీజేపీకి మద్దతు తెలిపారన్నారు. కళాకారులందరూ బీజేపీలో చేరాలని కోరారు. కళాకారులకు పక్కా ఇళ్లు, గుర్తింపుకార్డులు, వృద్ధ కళాకారులకు పింఛన్, బ్యాంకు రుణాలు అమలు చేసేందుకు పార్టీ కృషి చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో చిలకపాటి శ్రీనివాసులు, గంజి శ్రీనివాసులు, జాన్, బాబు పాల్గొన్నారు.

# వృద్ధుల సేవ సంతృప్తికరం

సమాజంలో వృద్ధులకు సేవచేయడం ఎంతో సంతృప్తికరంగా ఉంటుందని నెల్లూరురూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి పేర్కొన్నారు. సోమవారం నెల్లూరు నగరంలోని 27, 28డివిజన్లలోని రిత్విక్ ఎన్‌క్లేవ్, వెంకటరెడ్డినగర్ ప్రాంతాల్లో జరిగిన 'జన్మభూమి' సభలో పాల్గొని వృద్ధులకు పింఛన్లు, గర్భిణులకు పౌష్టికాహారాన్ని పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పింఛన్ల మంజూరులో అధికారులు జాగ్రత్తలు తీసుకోవాలని, ఏ ఒక్కరికీ అన్యాయం జరగకుండా చూడాలన్నారు. ఆదరణ కరువైన వృద్ధులకు వెయ్యిరూపాయలు పింఛన్ అందించడంతో వారికి భరోసా కల్పించినట్లు అవుతుందన్నారు. పారిశుద్ధ్య పరిరక్షణకు మరుగుదొడ్ల నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వం రూ.12వేలను మంజూరు చేస్తుందని ఈ అవకాశాన్ని అందరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో మాజీమంత్రి తాళ్ళపాక రమేష్‌రెడ్డి, మాజీఎమ్మెల్యే ముంగమూరు శ్రీధరకృష్ణారెడ్డి, టిడిపి రాష్ట్ర ప్రధానకార్యదర్శి తాళ్ళపాక అనూరాధ, కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి, కిలారి వెంకటస్వామినాయుడు, కార్పొరేటర్లు మేకల రజని, మల్లిబోయిన వెంకటేశ్వర్లుయాదవ్ తదితరులు పాల్గొన్నారు.

# ఎన్నికల సంఘం నోటీసులు

నెల్లూరు నగరపాలక సంస్థ ఎన్నికల్లో 54 డివిజన్లలో వివిధ పార్టీల తరఫున, స్వతంత్రంగానూ పోటీ చేసినవారు ఎన్నికల ప్రచారానికైన ఖర్చును, ఇతర వివరాలను తెలపాలని గతంలో ఎన్నికల సంఘం కోరివున్న నేపథ్యంలో, నేటికీ ఇంకా ఆ వివరాలు పంపలేదంటూ కార్పొరేషన్‌కు ఎన్నికల సంఘం తాజాగా నోటీసులు జారీ చేసింది. మొత్తం 399 మంది అభ్యర్థుల్లో ఇంకా 244 మంది ఆ వివరాలు పంపలేదని, నోటీసులు అందిన 20రోజుల లోపు వెంటనే ఎన్నికల ఖర్చుల వివరాలు పంపాలని ఆదేశించింది. ఎన్నికల సంఘం సూచించిన మేరకు వివరాలు పంపని వారిపై అనర్హతవేటు వేసే ప్రమాదం వుందని కూడా భావిస్తున్నారు. దీంతో అభ్యర్థులు ఆ వివరాలు పంపేందుకు హైరానా పడుతున్నారు. ఏదేమైనా, ఎన్నికల సంఘం పంపిన నోటీసులను కార్పొరేషన్ అధికారులు సంబంధిత అభ్యర్థులకు పంపేందుకు సమాయత్తమవుతున్నట్లు సమాచారం.

# నిత్యావసర సరుకుల పంపిణీ

నెల్లూరు నవాబుపేట, నరుకూరురోడ్డులోని శ్రీమతి మేరీభాయి విడోస్ హోంలో మంగళవారం జిల్లా ముస్లింయూత్ సేన ఆధ్వర్యంలో బియ్యం, వంటనూనె, పప్పు, సబ్బులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సంస్థ అధ్యక్షులు షేక్ ఖలీద్, నిత్యావసర సరుకులు అందజేసిన దాతలు పి.గౌస్, కమ్‌తర్, మున్న, ఇసాఖ్, మునాఫ్, జియావుల్‌హక్, మునవ్వర్, జమీర్, గయాజ్, ఏదోస్ పాల్గొన్నారు.

# అంతరాష్ట్ర నేరగాళ్ళ అరెస్ట్

- 1233గ్రాముల బంగారు, 41కిలోల వెండి స్వాధీనం
- నిందితుల్లో ఏఆర్ కానిస్టేబుల్



పోలీసు, విజిలెన్స్, ఇన్‌కంటాక్స్ అధికారుల మంటూ ఒంటరిగా ఉండే మహిళలను లక్ష్యంగా చేసుకుని ఇళ్లలోకి చొరబడి అందినకాడికి దోచుకెళ్లే అంతరాష్ట్ర నేరగాళ్ళను కావలి పోలీసులు అరెస్ట్ చేశారు. వారి నుంచి రూ.50లక్షలు విలువచేసే బంగారం, వెండి ఆభరణాలతో పాటు రెండుకార్లు స్వాధీనం చేసుకున్నారు. నిందితుల్లో ఒకరు రాష్ట్రంలో పేరుమోసిన గజదొంగ అడపా వెంకన్న ప్రధాన శిష్యుడు కాగా మరొకరు ఏఆర్ కానిస్టేబుల్. సోమవారం నెల్లూరు ఉమేష్‌చంద్రమెమోరియల్ కాన్ఫరెన్స్‌హాలులో జరిగిన విలేకరుల సమావేశంలో జిల్లా ఎస్పీ సెంథిల్‌కుమార్ నిందితుల వివరాలను వెల్లడించారు. గుంటూరుజిల్లా నరసారావుపేట మండలం కేశనపల్లికి చెందిన రాయపాటి వెంకయ్య అలియాస్ వెంకన్న, నెల్లూరుజిల్లా వెంకటాచలం మండలం రామదాసుకండ్రిగకు చెందిన చండీ వెంకటరమణయ్య అలియాస్ రమణ, నెల్లూరు దర్గామిట్టకు చెందిన ఏఆర్ కానిస్టేబుల్ దాసరి పెదకోటయ్య, నరసారావుపేటలోని శ్రీనివాసకాలనీకి చెందిన పి.వెంకటేశ్వరరావు, వంగా అమర్‌నాథ్‌రెడ్డి స్నేహితులు. వీరంతా ముఠాగా ఏర్పడి ఒంటరి మహిళలు ఉండే ఇళ్లను టార్గెట్ చేసేవారు. పోలీసు విజిలెన్స్, ఇన్‌కంటాక్స్ అధికారులమంటూ ఇళ్లను సోదా చేయాలని నమ్మించి అందినకాడికి దోచుకెళ్లేవారు. రాష్ట్ర వ్యాప్తంగా పలు నేరాలకు పాల్పడిన వీరిపై పోలీసులు నిఘా పెట్టారు. ఆదివారం అర్ధరాత్రి కావలి సమీపంలోని గౌరవరం వద్ద అనుమానాస్పదంగా తిరుగుతున్న రాయపాటి వెంకయ్య, చండీ వెంకటరమణయ్య, దాసరి పెద్దకోటయ్య, పి.వెంకటేశ్వరరావును అరెస్ట్ చేశారు. విచారణలో పలు నేరాలకు పాల్పడినట్లు నిందితులు అంగీకరించారు. వీరిపై పలు సెక్షన్ల క్రింద కేసులు నమోదు చేశారు.

***సిబ్బందికి అభినందనలు:*** అంతరాష్ట్ర నేరగాళ్ళను అరెస్ట్ చేసి రూ.50లక్షలు చోరీ సొత్తు రికవరీకి కృషిచేసిన కావలి, నెల్లూరురూరల్ డిఎస్పీలు డి.మోహన్‌రావు, వివిఎస్ రాంబాబు, కావలి ఒకటవ నగర ఇన్‌స్పెక్టర్ బి.ప్రసాద్, ఎస్‌ఐ అంజిబాబు, కె.నాగార్జునరెడ్డి, క్రైం పార్టీ సిబ్బంది వెంకయ్య, సత్యం, శ్రీనివాసరెడ్డి, మాధవ, అయోధ్య, వేణు, రవికాంత్, నజ్మల్‌ను ఎస్పీ అభినందించి రివార్డులు ప్రకటించారు.

# ఆ రెండూ మూతే?

(మొదటిపేజీ తరువాయి)

రాష్ట్ర విభజన తర్వాత టిడిపి, వైకాపా రెండు పార్టీలు ఆంధ్రా పార్టీలుగా మారిపోయాయి. ఎందుకంటే వీటి వ్యవస్థాపకులు ఆంధ్రావాళ్లే! వీటి పునాదులు ఆంధ్రావే! కాబట్టి తెలంగాణలో ఆదరించే పరిస్థితి ఉండదు. మొన్నటి ఎన్నికల్లోనే ఈ విషయం చూచాయగా అర్థమైపోయింది. అక్కడ టిఆర్ఎస్, కాంగ్రెస్.. వీటి తర్వాత బీజేపీకే మనుగడ ఉంటుంది. ఎట్టి పరిస్థితుల్లోనూ టిడిపి, వైసిపిలు బలపడలేవు. చంద్రబాబు, జగన్‌లకు తెలంగాణపై ఆశ చావలేదు. విభజనతో ఇంత నష్టం జరిగిపోయాక చంద్రబాబు ఇంకా కూడా రెండుకళ్ల సిద్ధాంతాన్నే అనుసరిస్తున్నాడు. తెలంగాణలో ఇప్పటికే తెలుగుదేశం పునాదులు కదిలిపోయాయి. ఆ పార్టీ కేడర్ అంతా కూడా టిఆర్ఎస్‌లో చేరిపోయింది. గట్టిగా ఇంకో రెండేళ్లలో మిగిలినవాళ్లు కూడా ఏదో ఒక పార్టీలోకి దూరడం ఖాయం. అంతో ఇంతో బలంగా వున్న తెలుగుదేశంకే అక్కడ దిక్కులేదు. జగన్ మళ్ళీ తెలంగాణలో వైకాపాను బలోపేతం చేయాలనుకుంటున్నాడు. తెలంగాణ బాధ్యతలను తన చెల్లెలు షర్మిలకు అప్పగించాడు. వీళ్ళిద్దరివి కూడా వృధాప్రయత్నాలు. తెలంగాణ కోసం ఆలోచించే బదులు ఆంధ్రాలో వచ్చిన అధికారాన్ని ఎలా నిలబెట్టుకోవాలనే దానిపై చంద్రబాబు, ఇప్పుడు దక్కకుండాపోయిన అధికారాన్ని వచ్చేసారైనా ఎలా దక్కించుకోవాలనే దానిపై జగన్ ఆలోచన చేస్తే ఇక్కడన్నా వాళ్ల పార్టీలు బాగుపడతాయి.

## కాలధర్మం

### కోటంరెడ్డి బేబిరెడ్డి



నెల్లూరు గ్రామీణ శాసనసభ్యులు కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి తండ్రి కోటంరెడ్డి బేబిరెడ్డి ఈ నెల 10వ తేదీ అర్ధరాత్రి తన స్వగ్రామమైన సంగం మండలం పడమటిపాలెంలోని స్వగృహంలో కన్నుమూసారు. ఆయన వయసు 74సంవత్సరాలు. ఆరోజు నిద్రకు ఉపక్రమించాక ఛాతిలో నొప్పి రావడంతో కుటుంబసభ్యులు బుచ్చిరెడ్డిపాలెంలోని ఆసుపత్రికి తరలించారు. అయితే ఆయన అప్పటికే మరణించినట్లు వైద్యులు నిర్ధారించారు. బేబిరెడ్డి మరణవార్తతో పడమటిపాలెం గ్రామం శోకసంద్రమైంది. మధ్యతరగతి రైతు కుటుంబంలో జన్మించిన బేబిరెడ్డి గ్రామంలో అందరి మంచి కోరే పెద్దమనిషిగా గుర్తింపు పొందారు. గ్రామంలో రాజకీయ కక్షలు, కార్పణ్యాలకు తావులేకుండా అందరినీ సమన్వయపరచుకుంటూ గ్రామానికి ఉపయోగపడే ఆలోచనలు చేసేవాడు. తన సోదరులు రాజకీయాల్లో వున్నా తాను మాత్రం ఆ ఛాయలకు వెళ్లలేదు. గ్రామంలో సాయిబాబా మందిరాన్ని స్థాపించి గ్రామస్తులలో ఆధ్యాత్మిక భావాలను పెంపొందించారు. ఆయనకు రాజకీయ వాసనలు గిట్టకపోయినప్పటికి ఆయన నుండి అలవర్చుకున్న క్రమశిక్షణ, పదిమందిని కలుపుకుపోయే తత్వం, కష్టపడే వ్యక్తిత్వంతో ఆయన పెద్దకొడుకు కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి సాధారణ కార్యకర్త స్థాయి నుండి ఎదిగి ఈరోజు శాసనసభ్యుడు కాగలిగారు. తన పెద్ద కొడుకును ఎమ్మెల్యేగా చూసిన ఆయన ఇంకో నాలుగు నెలలుండుంటే తన పెద్ద మనుమరాలు వివాహవేడుకను కూడా చూసుండేవారు. తన కూతురు పెళ్లిని దగ్గరుండి జరిపించాల్సిన తన తండ్రి ఇలా అకస్మాత్తుగా దూరం కావడాన్ని కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి జీర్ణించుకోలేకపోతున్నారు. ప్రతిరోజూ ఎంతో చలాకీగా తిరుగుతూ, పొలం పనులు చూసుకుంటూ అనుక్షణం కళ్లముందు కనిపించే బేబిరెడ్డి ఇక లేడన్న విషయాన్ని పడమటిపాలెం గ్రామస్తులు ఊహించుకోలేకపోతున్నారు. భగవంతునిలో ఐక్యమైన బేబిరెడ్డి ఆత్మకు శాంతి కలగాలని కోరుతూ కోటంరెడ్డి కుటుంబసభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలుపుతోంది 'లాయర్'.

### కొండ్రెడ్డి సంధ్య



విజయ డెయిరీ ఛైర్మెన్ కొండ్రెడ్డి రంగారెడ్డి ధర్మపత్ని శ్రీమతి కొండ్రెడ్డి సంధ్య ఈ నెల 13వ తేదీ కన్నుమూసారు. హఠాత్తుగా అనారోగ్యానికి గురైన ఆమెను హైదరాబాద్‌లోని ఓ కార్పొరేట్ ఆసుపత్రిలో ఉంచి మెరుగైన వైద్యం అందించినా ఫలితం లేకుండాపోయింది. సంధ్యమ్మకు ఒక కుమారుడు, ఒక కుమార్తె ఉన్నారు. ఈ నెల 14వ తేదీన స్వగ్రామమైన అల్లూరు మండలం నార్తమోపూరు గ్రామంలో ఆమె అంత్యక్రియలు జరిగాయి. జిల్లాలోని అన్ని రాజకీయ పార్టీల నాయకులు, ప్రజాప్రతినిధులు, ప్రముఖులు ఆమె భౌతిక కాయాన్ని సందర్శించి నివాళులర్పించారు. సహధర్మచారిణిని కోల్పోయి పుట్టెడు దుఖంలో వున్న రంగారెడ్డిని పరామర్శించారు. కొండ్రెడ్డి సంధ్య గృహిణిగా తన కుటుంబసభ్యులకే కాదు, ప్రజాప్రతినిధిగా కొంతకాలం ప్రజాసేవలోనూ తరించారు. ఒక పర్యాయం నార్తమోపూరు సర్పంచ్‌గా పనిచేసి తన గ్రామ అభివృద్ధికి బాటలు వేసిన ఆమె 2005లో ఇందుకూరుపేట నుండి జడ్పీటీసీగా విజయం సాధించి ఐదేళ్లపాటు తన మండలాభివృద్ధికి పాటుపడ్డారు. మంచి ఇల్లాలుగానే కాక మంచి ప్రజాప్రతినిధిగా కూడా ఆమె రాణించారు. ఆమె మరణంతో నార్తమోపూరులోని ప్రతి ఇంటా విషాదం నెలకొంది. ఆమె ఉత్తర క్రియలను ఈ నెల 20వ తేదీన నార్తమోపూరులోని స్వగృహం నందు నిర్వహించనున్నారు. కొండ్రెడ్డి సంధ్య మృతికి సంతాపం ప్రకటిస్తూ తమ ఇంటి జ్యోతిని కోల్పోయిన కొండ్రెడ్డి రంగారెడ్డి, వారి కుటుంబసభ్యులకు సానుభూతి తెలుపుతోంది 'లాయర్'.

## శ్రీ రాజరాజేశ్వరి ఆలయం ఇఓగా కోదండరామిరెడ్డి

నెల్లూరు దర్గామిట్టలోని శ్రీ రాజరాజేశ్వరి అమ్మవారి దేవస్థానం కార్యనిర్వహణాధికారిగా కోదండరామిరెడ్డిని నియమిస్తూ బుధవారం నెల్లూరు దేవదాయశాఖ సహాయ కమిషనర్ వేగూరు రవీంద్రరెడ్డికి ఉత్తర్వులు అందాయి. కోదండరామిరెడ్డిని అసిస్టెంట్ కమిషనర్ హోదాలో రాజరాజేశ్వరి దేవస్థాన ఇఓగా నియమించారు. ఇక్కడ ఇన్‌ఛార్జి ఇఓగా విధులు నిర్వర్తిస్తున్న పాయసం నాగేశ్వరరావును నరసింహకొండలోని శ్రీ లక్ష్మినరసింహ దేవస్థానం ఇఓగా నియమించారు.



ఈ నెల 15వ తేదీన నెల్లూరులోని ఎన్టీఆర్ నగర్‌లో 'సుజలధార' పథకం క్రింద కెపిసిఎల్ సహకారంతో శ్రేష్ఠ కంపెనీ వారు ఏర్పాటు చేసిన మినరల్ వాటర్ ప్లాంటును ప్రారంభించి మహిళలకు వాటర్‌క్యాన్‌లు అందజేస్తున్న మాజీమున్సిపల్ ఛైర్‌పర్సన్ టి.అనురాధ, మాజీమంత్రి రమేష్‌రెడ్డి, నెల్లూరు నగర శాసనసభ్యులు పి.అనిల్‌కుమార్‌యాదవ్ తదితరులు

# తీరంలో తీరని శోకం

(మొదటిపేజీ తరువాయి)

ప్రజలందరినీ నిర్దయగా కష్టాల సుడిగుండాల్లోకి నెట్టివేసింది. ఎంతో వ్యయంతో కట్టుకున్న భవనాలూ, రోడ్లూ, రవాణామార్గాలూ.. విమానాశ్రయం, ఓడరేవు, అందమైన బీచ్, ఫిషింగ్‌హార్బర్.. చెక్కు చెదరదనుకున్న ఉక్కు కర్మాగారం, మరెన్నో ఫ్యాక్టరీలూ, సంస్థలూ.. ప్రభుత్వ–ప్రైవేట్ రంగాలూ..విద్యుత్–టెలిఫోన్ వ్యవస్థలూ ఒకటేమిటి అన్నీ సర్వనాశనమైపోయాయి. హుద్‌హుద్ భీభత్సం అటు విశాఖ ప్రజలనే కాదు..మరోవైపు ఉత్తరాంధ్రనూ గడగడలాడించింది. తుఫాన్ దెబ్బకు విజయనగరం కన్నీరుమున్నీరైంది. శ్రీకాకుళం అతలాకుతలమైపోయింది. తూర్పుగోదావరి శోకసాగరమైంది. ఎటు చూసినా తుఫాన్ బాధితుల ఆర్తనాదాలూ.. వాగులు వంకలు పొంగడంతో కష్టాల పాలైన వరద బాధితుల రోదనలూ మిన్నంటుతున్నాయి. హుదుద్ తుఫాన్ భీభత్సం నాలుగు జిల్లాల్లోని 44మండలాల్లో భీభత్సం సృష్టించింది. మొత్తంగా 21 మంది ప్రాణాలను పొట్టనబెట్టుకుంది. ఉత్తరాంధ్ర అంతటా వేలాది ఇళ్ళు నేలమట్టమైపోయాయి. పెద్దపెద్ద భవనాలు, అపార్ట్‌మెంట్లు బీటలువారాయి. అనేక గ్రామాలు జలదిగ్గంధంలో చిక్కుకుపోయాయి. వందల సంఖ్యలో పశువులు, మూగజీవాలు మృత్యువాత పడ్డాయి. లక్షలాది ఎకరాల్లో పంట నష్టం జరిగింది. హుద్‌హుద్ చేసిన నష్టం అంతా ఇంతా కాదు. ఆ కష్టం చెప్పనలవి కాదు..ఆ నష్టం లెక్కలకు అందేది కాదు. దాదాపు వేలాది కోట్ల నష్టం జరిగి వుండవచ్చని భావిస్తున్నారు. నాలుగు జిల్లాల్లోనూ రోడ్లు ధ్వంసమైపోయాయి. రవాణా వ్యవస్థ నాశనమైంది. రైళ్ళూ బస్సులూ ఇతరత్రా వాహనాలూ ఎక్కడివక్కడ ఆగిపోయాయి. జనజీవనం పూర్తిగా స్తంభించిపోయింది. వేలాది కరెంట్ స్తంభాలు నేలకూలిపోయి అంతటా గాఢాంధకారం దాపురించింది. రవాణా, విద్యుత్‌వ్యవస్థలన్నీ దెబ్బతినిపోయాయి. అన్ని రంగాలూ, అన్ని వ్యవస్థలూ సర్వనాశనమయ్యాయి. చివరికి తాగేందుకు గుక్కెడు నీళ్ళు లేక.. పిల్లలకు పాలు దొరక్క..ఎటు చూసినా దీనవదనాలతో తల్లిదండ్రులు.. నిత్యావసర వస్తువులు దొరక్క.. తిండీతిప్పలూ లేక ప్రజలు పడిన అవస్తలు హృదయ విదారకరం. కళ్ళ ముందే ఇళ్ళు కూలిపోయిన ప్రజలు పడుతున్న బాధలు వర్ణనాతీతం. చెట్టు చేమలన్నీ నాశనమయ్యాయి. మహావృక్షాలు సైతం కూకటివేళ్ళతో సహా నేలకూలిపోయాయి. వూరూ వాడా అంతా తుఫాన్ ధాటికి నాశనం కాగా, లక్షలాదిమంది ప్రజలు బిక్కుబిక్కుమంటూ, ప్రాణాలు అరచేతిలో పెట్టుకున్నారు. ఈ కష్టాన్ని మరిచిపోవడానికి, ఈ నష్టాన్ని పూడ్చుకోవడానికి ఇంకా ఎన్ని నెలలు..ఎన్ని సంవత్సరాలు పడుతుందో చెప్పలేం! ఇంతటి విషాదం నవ్యాంధ్రకు ఇదే తొలిసారి. ఈ విషాద సంఘటనతో మహానేత ప్రధాని నరేంద్రమోడీ చలించిపోయారు. స్మార్ట్ సిటీని చేద్దామనుకున్న విశాఖ ఇలా కకావికలు కావడం ఆయనను మరింత బాధించింది. హుటాహుటినే విశాఖకు తరలివచ్చారు. తుఫాన్‌కు దెబ్బతిన్న ప్రాంతాలన్నిటినీ కలియదిరిగారు. ప్రజలు పడుతున్న బాధలను కళ్ళారా చూశారు. వారిని ఊరడించి.. ఓదార్చారు. ఈ కష్టంలో ఆదుకునేందుకు తామున్నామంటూ భరోసా ఇచ్చారు. తుఫాన్‌ధాటికి విలవిలలాడుతున్న ఉత్తరాంధ్ర ప్రజలను అన్నివిధాలా ఆదుకుంటామని గట్టి హామీ ఇచ్చారు. అంతేకాదు, కేంద్రం తరపున తక్షణసాయంగా వెయ్యికోట్ల రూపాయలు ప్రకటించారు. ఈ విపత్తులో ప్రాణాలు కోల్పోయినవారికి కేంద్రం తరపున రూ.2 లక్షలు, బాధితులకు రూ.50వేల వంతున సాయం అందించనున్నట్లు ప్రకటించారు. తిరిగి ఇక్కడి ప్రజలు కోలుకునేవరకూ కేంద్రం నుంచి పూర్తిస్థాయిలో సహాయ సహకారాలుంటాయన్నారు. ఈ విలయం ఎంతో విషాదకరమని ప్రధాని ఆవేదన వ్యక్తం చేస్తూ, పట్టణ ప్రాంతాల్లో ప్రకృతి భీభత్సానికి ఇంతటి భారీ నష్టం జరగడం ఇదే మొదటిసారి అని ఆయన భాదాతప్తహృదయంతో అన్నారు. ప్రజలకు తక్షణ సహాయకార్యక్రమాలు అమలుచేస్తామని, అటు రాష్ట్రప్రభుత్వం, ఇటు కేంద్ర ప్రభుత్వం ప్రజలకు అన్ని విధాలా సాయం అందిస్తాయని స్పష్టం చేశారు. ప్రధాని భరోసాతో అక్కడ కష్టాల్లో వున్న ప్రజలకు ఎంతో ఊరట లభించినట్లయింది. ప్రధాని పర్యటనలో ప్రధానితోపాటు గవర్నర్ నరసింహన్, ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, కేంద్రమంత్రులు వెంకయ్యనాయుడు, అశోక్ గజపతిరాజు, పలువురు రాష్ట్రమంత్రులు వున్నారు. ఉన్నతాధికారులు, నాయకులు అందరూ విశాఖ వీధుల్లో పర్యటించి, తుఫాన్ భీభత్సాన్ని చూసి, బాధితులకు ఆపన్న హస్తం అందించేందుకు సమాయత్తమయ్యారు. ఇప్పటికే అనేక ప్రాంతాల్లో సహాయకచర్యలను ముమ్మరం చేశారు.

మరోవైపు రాష్ట్రముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు తుఫాన్‌బాధితులను ఆదుకునేందుకు విశాఖలోనే వుంటూ, సహాయక చర్యలను స్వయంగా పర్యవేక్షిస్తున్నారు. అడుగడుగునా ఆయన అన్ని ఏర్పాట్లనూ పర్యవేక్షిస్తూ, ప్రజలకు ఈ కష్టసమయంలో కావాల్సిన అన్నిరకాల వసతుల ఏర్పాటులో నిమగ్నమయ్యారు. దీంతో మంత్రులు, అధికారులు, ఉన్నతాధికారులు, సిబ్బంది అందరూ కలసి విశాఖకు, ఉత్తరాంధ్రజిల్లాలకూ కదలివచ్చి ప్రజలను ఆదుకునేందుకు యుద్ధప్రాతిపదికన సకల చర్యలూ తీసుకుంటూవుండడం ఎంతైనా అభినందనీయం. విశాఖలో పూర్తిస్థాయిలో మళ్ళీ సాధారణ పరిస్థితులు నెలకొనేవరకూ, ఈ విపత్తు నుంచి ప్రజలు పూర్తిగా కోలుకునేవరకూ తాను ఇక్కడే వుండి ప్రజలకు సేవలందిస్తానని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేయడంతో, అధికారయంత్రాంగమంతా మరింత అప్రమత్తంగా వుంటూ, వేగవంతంగా సహాయక చర్యలు చేపడుతున్నారు. ఇంకోవైపు, తుఫాన్ బాధితులను ఆదుకునేందుకు సినీరంగం ప్రముఖులు, రాష్ట్రవ్యాప్తంగా ఎందరో వదాన్యులు, పలు సేవా సంస్థలవారు, స్వచ్ఛంధసంస్థలవారు, అనేక ప్రాంతాల నుంచి ప్రముఖులు, ప్రజలు తమవంతుగా విరాళాలు ఇచ్చేందుకు ముందుకు వస్తున్నారు. మరికొందరు బాధితులకు అత్యవసరమైన వస్తుసామగ్రిని, ఆహారపొట్లాలు అందించేందుకు సిద్ధమయ్యారు. తమకు చేతనైనంత సాయం చేసి బాధితులను అన్ని విధాలా ఆదుకునేందుకు ఇలా అనేక ప్రాంతాల నుంచి ప్రజలు, ప్రముఖులు, అధికారులు, నాయకులు సమాయత్తం కావడం ఎంతో అభినందనీయం.

# అందుబాటులో అపోలో వైద్యసేవలు

అపోలో ఆసుపత్రిలో అన్ని వైద్యసేవలు అందుబాటులో వున్నాయని అపోలో ఆసుపత్రి వైద్యబృందం తెలిపింది. 12వతేదీ జరిగిన విలేకర్ల సమావేశంలో కార్డియాలజీ విభాగాధిపతి డాక్టర్ విజయ్‌చంద్రారెడ్డి మాట్లాడుతూ గుండెకు సంబంధించిన వ్యాధి లక్షణాలు బయటపడినప్పుడు గంటలోపు ఆసుపత్రికి వస్తే కండరాలు దెబ్బతినకుండా రోగిని కాపాడేందుకు అత్యాధునిక సౌకర్యాలు అపోలోలో ఉన్నాయన్నారు. డాక్టర్ బి.శరత్ మాట్లాడుతూ వందమంది దంపతుల్లో 25మందికి పిల్లల కోసం చికిత్స అవసరమవుతుందని, టెస్ట్‌ట్యూబ్ బేబి పద్ధతిలో వైద్యసేవలు అపోలో ఆసుపత్రిలో అందుబాటులో వున్నాయన్నారు. ఈ సమావేశంలో డాక్టర్ డి.వాసంతి, డాక్టర్ విజయ్ అమర్‌నాథ్‌రెడ్డి, రోహిణి, డాక్టర్ జయకుమార్‌రెడ్డి, డాక్టర్ ఎస్.వి.యస్. శ్రీధర్, డాక్టర్ జిమ్మిషాద్, డాక్టర్ శంకర్‌నారాయణ తదితరులు పాల్గొన్నారు.

# చంద్రబాబుకు షాకిచ్చిన నెల్లూరు తమ్ముళ్ళు

శ్రీను గల్పిక

అది ఐఆర్ 20-420 మున్సిపల్ కార్పొరేషన్ ముదురుదోమలకు ప్రసిద్ధిగాంచిన నెల్లూరు మహా నగరం. జిల్లా తెలుగుదేశంపార్టీ కార్యాలయమైన ఎన్టీఆర్‌భవన్‌లో తెలుగుతమ్ముళ్ళు సమావేశమయ్యారు. పక్కరోజు జన్మభూమి ప్రోగ్రామ్ కోసం హైటెక్‌రత్న చంద్రబాబు నెల్లూరుకు వస్తున్న నేపథ్యంలో ఏర్పాట్లపై చర్చ జరుగుతుందక్కడ. ముదురు దోమల శాఖ మంత్రి పి.నారాయణతో పాటు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, ఆదాల ప్రభాకర్‌రెడ్డి, బీద రవిచంద్ర, ముంగమూరు శ్రీధరకృష్ణారెడ్డి, జ్యోత్స్నలత, బల్లి దుర్గాప్రసాద్‌రావు, పరసారత్నం, బొల్లినేని రామారావు, కురుగొండ్ల రామకృష్ణ, పోలంరెడ్డి శ్రీనివాసులురెడ్డి, అబ్దుల్ అజీజ్, చాట్ల నరసింహారావు, డాక్టర్ జడ్.శివప్రసాద్, కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి, అనూరాధ, అంచల వాణి వంటి నాయకులంతా ఉన్నారు. అందర్నీ ఉద్దేశించి మంత్రి నారాయణ మాట్లాడుతూ... చంద్రబాబు రేపు నెల్లూరొస్తున్నారు. జిల్లా పార్టీలో మనందరి మధ్య విభేదాలున్నాయనే విషయం ఆయన దృష్టికి వెళ్లింది. ముఖ్యంగా మీరంతా నాతో సఖ్యతగా లేరని తెలిసి ఆయన బాగా బాధపడుతున్నాడు. రేపు ఆయన ముందు కూడా మనం ఇలాగే ఎడ మొగంపెడ మొగంగా ఉన్నామంటే ఆయన మనసు బాధపడుతుంది. ఆయన మనసును కష్టపెట్టకుండా ఆనందంగా ఉంచడం కోసమన్నా అందరం కలసికట్టుగా ఉన్నట్టు నటిద్దామని ప్రతిపాదించాడు. దానికి సోమిరెడ్డి స్పందిస్తూ.. దీనివల్ల చంద్రబాబుకు మంచి జరగపోగా ఆయన షాక్‌కు గురయ్యే ప్రమాదం ఉందన్నాడు. నారాయణ దానికి ఒప్పుకోలేదు. మీరు కావాలనే అలా మాట్లాడుతున్నారు, మన నాయకుడిని మెప్పించడం కోసం ఒకరోజు నాతో స్నేహంగా ఉండలేరా అని అడిగాడు. అందుకు సోమిరెడ్డి... ఒక్కరోజుకైతే ఎలాగోలా నటిస్తాం, కాని రోజూ అలాగే ఉండాలంటే కుదరదు. కలిసి వుండడం కంటే రోజూ కొట్టుకుంటూ ఉంటేనే రాజకీయాలు సరదాగా ఉంటాయి, నీకు కొత్త కాబట్టి విభేదాలలో వున్న కిక్ గురించి తెలియదు. రాను రాను నీకే తెలుస్తుందిలే, రేపు ఒక్కరోజే మన కమిట్‌మెంట్. చంద్రబాబు హెలికాప్టర్ ఎక్కగానే ఎవరి దారి వారిదే అని చెప్పాడు. వెంటనే రమేష్‌రెడ్డి లేచి.. నన్ను చూస్తే మీకు కంపరం కదా, మరి నేను మీకు దూరంగా వుండాలా? దగ్గరగా ఉండాలా? అని అడిగాడు. దానికి నారాయణ... చంద్రబాబు గారి కోసం రేపు ఒక్కరోజుకు నేను అడ్జస్ట్ అవుతాలే అని అన్నాడు. చంద్రబాబుకు దిమ్మతిరిగే లెవల్లో ఏర్పాట్లు చేయాలని తీర్మానించి అందరూ లేచారు.

★★★★★

అది నెల్లూరు పోలీస్ పరేడ్ గ్రౌండ్. తెలుగుదేశం నాయకులంతా పసుపు చొక్కా, పసుపు ఫ్యాంట్‌లు వేసుకుని యూనిఫామ్‌లో వచ్చారు. అధికారులు, పోలీసు సిబ్బంది అప్రమత్తంగా ఉన్నారు. అంతలో హెలికాప్టర్ ల్యాండయ్యింది. చంద్రబాబు దిగాడు. జిల్లా తెలుగుదేశం నాయకులందరూ ఒకరి భుజాల మీద ఒకరు చేతులు వేసుకుని చంద్రబాబు వద్దకు పోయారు. వారినలా చూడగానే చంద్రబాబు ఉద్వేగానికి లోనయ్యాడు. కళ్లల్లో నీళ్లు సుడులు తిరిగాయి. ఏడుపును ఆపుకోలేకపోయాడు. ఆనందంతో ఏడ్చేసాడు. ఆ పరిణామానికి అందరూ బిత్తరపోయారు. అది చూసి సోమిరెడ్డి నారాయణతో... చూసావా నారాయణ, నేను ముందుగానే చెప్పానా? ఇలాంటి సన్నివేశాలను ఒక్కసారిగా చూస్తే చంద్రబాబు గారు తట్టుకోలేరని.... ఇక ముందు ఎన్ని విపరీతాలు జరుగుతాయోనని ఆందోళన చెందసాగాడు. చంద్రబాబు కర్చీఫ్‌తో కన్నీళ్లు తుడుచుకుంటూ... మీరంతా ఇలానే ఉండండి... నేను కూడా మీతో కలిసి ఫోటో దిగుతాను, ఆ ఫోటోను ఫ్రేమ్ కట్టించుకుని ఆఫీసులో పెట్టుకుని రోజూ చూసుకుంటూనంటూ తన పర్సనల్ కెమెరామెన్‌తో అందరితో కలిసి ఒక ఫోటో తీయించుకున్నాడు. తర్వాత అందరూ ఒకే బస్సులో కోవూరు పాలిటెక్నిక్ కాలేజీ వద్దకు చేరుకున్నారు. అక్కడ సభకు మహిళలు భారీగా వచ్చివున్నారు. చంద్రబాబు మైకందుకుని... చెల్లెళ్లు, మీ చేతి చేపల పులుసు భలే వుంటుంది, మీ నెల్లూరు బిర్యానీకి చాలా ఫేమస్, పెరుగన్నంలో గోంగూర నంజుకుతింటే చాలా బాగుంటుంది. రియాజ్ బిరియాని, కోమల విలాస్ సాంబారు, మురళీకృష్ణ పెరుగన్నం, జైహింద్ స్వీట్ కాంబినేషన్ అదిరిపోద్ది అని చెప్పుకుపోతుండగా నారాయణ జోక్యం చేసుకుని, సార్, ఇది ఫుడ్ ఫెస్టివల్ కాదు, జన్మభూమి సభ అని గుర్తు చేశాడు. అప్పుడు చంద్రబాబు ఈరోజు మిమ్మల్ని అన్యోన్యంగా చూసాక నాలో ఆనందం ఉరకలువేస్తుంది. జన్మభూమి, గిన్మభూమి జాన్తానై... ఈరోజంతా ఎంజాయ్... నన్ను ఆపకండి అంటూ.. తమ్ముళ్లు 'ఆరేసుకోబోయి పారేసుకున్నాను హరి... కోకెత్తుకెళ్లింది కొండ గాలి' అంటూ పాడి ఈ పాట ఏ సినిమాలోదో చెప్పండని ప్రశ్నించాడు. వెంటనే సభలో నుండి... 'వేటగాడు... వేటగాడు' అంటూ ఈలలు, కేకలు వేస్తూ చెప్పారు. వెంటనే చంద్రబాబు "ఓ అప్పారావు, ఓ సుబ్బారావు ఓ వెంకట్రావు, ఓ రంగారావు... ఎవరో ఎవరో వస్తారనుకుంటే నువ్వొచ్చావా?" అనే పాట పాడి ఇది ఏ సినిమాలోదో చెప్పమన్నాడు. వెంటనే సభలో నుండి 'బొబ్బిలిపులి' అంటూ సమాధానం. తర్వాత చంద్రబాబు కోటంరెడ్డి శీనయ్యకు మైకిచ్చి... తమ్ముడూ ఓ మంచి పాటేసో అని చెప్పాడు. శీనయ్య... "సింహమంటి చిన్నోడే వేటకొచ్చాడే" అనే బాలయ్య పాట పాడి అలరించాడు. అక్కడితో కోవూరు సభ ముగిసింది. తర్వాత అందరూ దక్కిలి చేరుకున్నారు. ఇక్కడ సభలో చంద్రబాబు మైకు అందుకుని... తమ్ముళ్లు వెంకటగిరిలో శంషాబాద్‌ను తలదన్నేలా ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్టును నిర్మిస్తానన్నాడు. ఆ మాటకు సభావేదికపై ఉన్నోళ్లతో పాటు జనాలు కూడా నోరెళ్లబెట్టారు. నారాయణ కలుగుజేసుకుని ఇక్కడ ఎయిర్‌పోర్టు పెట్టాలనే ఆలోచన మీకెలా వచ్చింది సార్, అని అడిగాడు. అప్పుడు చంద్రబాబు... వెంకటగిరిలో ఎయిర్‌పోర్ట్‌కు రన్‌వే అవసరం లేదు. ఏటిసి టవర్ పల్లేదు, సిబ్బంది అక్కర్లేదు. ఇక్కడ పొలాల్లో విమానాలు సేఫ్‌గా ల్యాండ్ అవుతుంటాయి. పదిహేనేళ్ల క్రితం మన చిరంజీవి, బాలయ్య వంటి వాళ్లున్న విమానం ఇలాగే ల్యాండయ్యింది. కాబట్టి రూపాయి ఖర్చు లేకుండా ఇక్కడ ఎయిర్‌పోర్టు పెట్టొచ్చన్నాడు. ఆ మాటలతో నారాయణకు జుట్టు పీక్కోవాలనిపించింది. కాని అలా చేస్తే జుట్టు పోయి గ్లామర్ దెబ్బతింటుందని వూరుకుని... సోమిరెడ్డితో ఏంటన్నా ఇదంతా అని అడిగాడు. దానికి సోమిరెడ్డి... నేను ముందే చెప్పా కదా నారాయణ... మనం ఉన్నట్లుండి ఐక్యంగా కనపడితే ఆయన షాక్‌కు గురవుతారని, మీరేమో వినకపోతిరి. దాని ఎఫెక్టే ఇది అని చెప్పాడు. అందుకు నారాయణ... మనం ఒకరోజు సఖ్యతగా ఉంటేనే ఇలా వుంటే ఇక రోజూ స్నేహంగా వుంటే ఇంకెన్ని అనర్థాలు జరుగుతాయోనన్నాడు.

## ప్రపంచీకరణతో విలువలు కనుమరుగవుతున్నాయి

- సాహిత్య అకాడమి తెలుగు సలహా మండలి సంచాలకులు ఎన్.గోపి




ప్రపంచీకరణతో విలువలు కనుమరుగవుతున్నాయని సాహిత్య అకాడమి తెలుగు సలహా మండలి సంచాలకులు ఎన్.గోపి తెలిపారు. సాహిత్య అకాడమి, నెల్లూరు రచయితల సంఘం సంయుక్తంగా ఆదివారం నెల్లూరు విక్రమ సింహపురి సమావేశ మందిరంలో నిర్వహించిన వర్తమాన తెలుగు కథ సదస్సులో గోపి పాల్గొని మాట్లాడుతూ అభివృద్ధి చెందుతున్న దేశాల మనుగడను ప్రపంచీకరణ దెబ్బతీస్తుందన్నారు. ఎదుటివారి కష్టాలను ఆలోచించి వారి సాధక బాధకాలను తీర్చటానికి కృషి చేయడానికి రచయితలు సిద్ధంగా ఉండాలని సూచించారు. చదివించడంతో పాటు పాఠకులకు ఆనందాన్ని పంచడానికి రచనలు దోహదపడాలన్నారు. యువత సాహిత్యంపై ఆసక్తి కనబరచక పోవడం పట్ల అందరూ దృష్టి పెట్టాలన్నారు. నేటి సాహిత్యంలో కథాశిల్పం, బ్రహ్మ పదార్థంగా తయారవుతోందని ప్రముఖ కథా రచయిత విహారి అన్నారు. భాషా శైలిలో మాండలికం ఆవశ్యకతను గుర్తించి అందుకు అనుగుణంగా రచనలు ఉండేలా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా బెంగళూరుకు చెందిన సాహిత్య అకాడమి కార్యక్రమ అధికారి కెపి రాధాకృష్ణన్, ఎన్.గోపి, విహారిలను, నిర్వాహకులు సన్మానించారు.

ఈ కార్యక్రమంలో నెల్లూరు రచయితలు సంఘం అధ్యక్షుడు ఎ.జయప్రకాష్, గౌరవఅధ్యక్షులు పాతూరి అన్నపూర్ణ ప్రధానకార్యదర్శి మాటేటి రత్నప్రసాద్, ఇంద్రగంటి జానకిబాల, వి.రాజారామ్‌మోహన్‌రావు, వెన్నెలకంటి రాజేశ్వరప్రసాద్, చంద్రలత, ముక్తేవి, భారతి మధురాంతకం నరేంద్ర తదితరులు పాల్గొన్నారు.

## 17నుంచి భారతీయ తాత్విక చింతనా సదస్సు

తిరుపతి శ్రీ వెంకటేశ్వర విశ్వవిద్యాలయంలో 88వ భారతీయ తాత్విక చింతన సదస్సు జరుగుతుందని ప్రాంతీయ సమన్వయకర్త ప్రొఫెసర్ అబ్దుల్ సత్తార్ పేర్కొన్నారు. వర్సిటీ తత్వశాస్త్ర విభాగం ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ సదస్సులో భాగంగా మూడురోజుల పాటు వివిధ కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. దీపావళి పండుగను పురస్కరించుకుని ఈ నెల 23వ తేదీ తిరుపతిలో దీపావళి కవిసమ్మేళనం జరుగుతుందన్నారు.

## సార్క్ దేశాల రచయితల సదస్సుకు
## పెరుగుకు ఆహ్వానం



జైపూరులో ఈ నెల 18,19 తేదీల్లో జరిగే సార్క్ దేశాల రచయితల సదస్సుకు ప్రముఖ రచయిత పెరుగు రామకృష్ణకు ఆహ్వానం అందింది. 11 దేశాలకు చెందిన కవులు విద్యావేత్తలు, రచయితలు ఈ సదస్సుకు హాజరవుతున్నారు. దక్షిణ భారతదేశం నుంచి ముగ్గురికి ఆహ్వానం అందగా అందులో పెరుగు రామకృష్ణ ఒకరు. ఇది సింహపురికే గర్వకారణం.

## సమసమాజం కోసం
## పోరు సాగించిన ఏకైక వ్యక్తి జె.పి



సమసమాజం కోసం నిరంతరం పోరు సాగించిన ఏకైక వ్యక్తి లోకనాయక్ జయప్రకాష్‌నారాయణ అని సామాజిక కార్యకర్త వీరీరాజు పేర్కొన్నారు. ఆదివారం నెల్లూరులోని ఆదిత్య డిగ్రీ కళాశాలలో జేపీ సేవా సంస్థ ఆధ్వర్యంలో జయప్రకాష్ నారాయణ 116వ జయంతి వేడుకలు జరిగాయి. ముందుగా జయప్రకాష్‌నారాయణ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం రాజు మాట్లాడుతూ సోషలిస్టు ఉద్యమాన్ని రామ్ మనోహర్‌లోహియాతో కలసి దేశ వ్యాప్తంగా ముందుకు నడిపిన ఉద్యమ నేత జయప్రకాష్ నారాయణ అని, దేశ స్వాతంత్ర్య ఉద్యమంలో కీలకపాత్ర పోషించారని, జనతా పార్టీని స్థాపించి అవినీతిని నియంత్రించడంలో నిరంతర కృషి చేసారన్నారు. నేటి రాజకీయనాయకుల్లో స్వార్థం తప్ప ప్రజలకు మేలు చేయాలన్న దృక్పథం లేదని, దాంతో ఈ వ్యవస్థ పై వ్యతిరేకత వస్తుందన్నారు. యువకులు, విద్యార్థులు అన్ని రంగాల్లో రాణిస్తూనే రాజకీయాల్లోకి వచ్చి జయప్రకాష్ నారాయణ స్ఫూర్తితో సామాజిక సేవ చేయాలని కోరారు.

ఈ కార్యక్రమంలో ఆదిత్య డిగ్రీ కళాశాల కరస్పాండెంట్ ఆచార్య ఆదిత్య జేపీ సేవా సమితి అధ్యక్షుడు తుంగా పాండురంగారెడ్డి, లోక్‌సత్తా ఉద్యమ సంస్థ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఎం.మాలకొండారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## కదంబం

### కాలం

- డా॥ రాధేయ
అనంతపురం. 9985171411

కాలం ఒక పక్షి గమనం
గమ్యంలేని సుదీర్ఘ మార్గంలో
అసాధారణ విశ్వాసాన్ని
అవలీలగా జయించేస్తుంది
కాలం ఒక జాజ్వల్యమాన దీపిక
నాడీ మండలంలో అలజడి రేపి
ఉద్వేగాలతో సంవేదనా
స్వరాలను వెలువరిస్తుంది!
కాలం ఒక డేగ చూపు
రోదనా వాదనల్ని వినిపించే
తీతువుపిట్టల్లాంటి గుండెల్లోకి
ఊహాజనిత భయాల్ని ఇంజెక్ట్ చేస్తుంది
కాలం ఒక కీచునవ్వు
ప్రతికూల జీవనరేఖలతో
మనుషుల బుర్రల్లోకి
చెడు భావాలను కూరుతుంది

# ఐరన్ ర్యాకుల్లోనూ ఆకుకూరల సాగు

## - విఖ్యాత శాస్త్రవేత్త డాక్టర్ జగదీష్





స్వచ్ఛమైన ఆకుకూరల్ని మనవే స్వయంగా పండించుకుంటే అందులో ఎంతో ఆనందం.. సంతృప్తి వుంటుంది. అందులోనూ మనకెంతో ఇష్టమైన ఆకు కూరలను మనమే పండించుకోగలిగితే, తక్కువ వ్యయంతో ఎక్కువ దిగుబడి సాధించగలిగితే మరెంత బావుంటుందో కదా!..సరిగ్గా ఈ ఆలోచనలకే కార్యరూపం తెచ్చారు ప్రఖ్యాత సంప్రదాయేతర ఇంధన వనరుల శాస్త్రవేత్త, నెల్లూరులోని నాయుడమ్మ సెంటర్ ఫర్ డెవలప్‌మెంట్ ఆల్టర్నేటివ్స్ డైరెక్టర్ డా.ఎ. జగదీష్. స్వయంగా ఆయన ఐరన్ ర్యాకుల్లో ఆకుకూరలను పుష్కలంగా పండిస్తున్నారు కూడా. అద్దె ఇళ్ళలో వుంటున్నాం, మనకు ఆకుకూరలు పెంచుకునేందుకు స్థలం ఎక్కడుందీ అనుకునేవారు, ఆకుకూరల సాగుకు అనువైన చోటు లేదని భావించేవారందరికీ ఈ కొత్తవిధానం ఒక వరం. ఈ విధానంతో అత్యంత తక్కువ ఖర్చుతో, కొద్దిపాటి స్థలాన్ని మాత్రమే వినియోగించుకుంటూ ఎవరైనా సరే, హాయిగా ఆకుకూరలను పండించుకోవచ్చు. మనకెంతో ఇష్టమైన, ఆరోగ్యకరమైన, పౌష్టికాహార విలువలున్న ఆకుకూరలను ఎంపిక చేసుకుని, ఐరన్ ర్యాకుల్లో వీటిని సాగుచేసుకోవచ్చని డాక్టర్ జగదీష్ ఇలా సూచిస్తున్నారు.

### ఐరన్ ర్యాకుల్లో సాగుచేసే విధానం:

మార్కెట్లో ఓపన్ బుక్ ఐరన్ ర్యాక్‌లు లభిస్తాయి. బహుశా వీటి ధర రూ.2వేల కంటే ఎక్కువ వుండదు. ఆకుకూరల సాగుకు ఇవెంతో ఉపయోగపడతాయి. ఈ ర్యాక్‌లలో ఎత్తును సవరించేందుకు రంధ్రాలుంటాయి. 6 అడుగుల ఎత్తు, 3 అడుగుల వెడల్పు వున్న ర్యాక్‌లో 5 ప్లేట్లు అమర్చవచ్చు. ఆ ప్లేట్లను తిప్పిపెట్టడం వల్ల, ఒక పళ్ళెం వలె లోతుగా వుంటాయి. ఎక్కువ లోతు కోసం ఆ ప్లేటు చుట్టూ 4 అంగుళాల రేకును అమర్చుకోవాలి. ఆ ప్లేట్లను ఏటవాలుగా అమర్చడం వల్ల, ఎక్కువ నీరు క్రిందికి జారిపోతుంది. ఎరువుల సంచును కత్తిరించి ప్లేటు పైభాగంలో కప్పి, మట్టిని, సహజమైన పేడ ఎరువును నింపాలి. అంతే, ఇక మనకు కావాల్సిన ఆకుకూరల విత్తనాలు తెచ్చి చల్లుకోవడమే. ముఖ్యంగా, పాలకూర, చుక్కకూర, మెంతికూర, పొనగంటి కూర మొదలైనవి ఈ ర్యాకుల్లో వేసుకుని సాగుచేసుకోవచ్చు. సహజ ఎరువును వాడడం వల్ల మనం పెంచే ఆకుకూరల్లో పోషకాహారం కూడా దండిగానే వుంటుంది.

### ఆకుకూరలు ఎంతో ఆరోగ్యకరం :

ఆకుకూరలు మనకెంతో ఆరోగ్యాన్నిస్తాయి. ఇతరత్రా ఆహారం కంటే ఆకు కూరల్లో ఎక్కువ క్యాలరీలు వుంటాయి. ఎంతో ముఖ్యమైన ఎ, సి, ఇ, కె, బి విటమిన్లు మనకు పుష్కలంగా లభించేది ఆకుకూరల్లోనే. శరీరానికి కావాల్సిన కాల్షియం, మెగ్నీషియం, ఐరన్, పొటాషియం లవణాలు కూడా ఆకుకూరల్లో సమృద్ధిగా వుంటాయి. ఆకుకూరల్లో పీచు అధికంగా వుండడం, కొవ్వు పదార్థం తక్కువగా వుండడం ఆరోగ్యానికి ఎంతగానో ఉపకరిస్తాయి. ప్రొటీన్లు కూడా ఆకుకూరల్లో అధికంగా వుంటాయి. మన ఆరోగ్యానికి ఇన్ని రకాల ప్రయోజనాలను కలిగించే ఆకుకూరలను మనకు మనమే, స్వల్ప మొత్తం వ్యయం చేసి సాగు చేసుకోగలిగితే, మనకు ప్రీతికరమైన ఆకుకూరలు ఎల్లప్పుడూ మనకు అందుబాటులో వున్నట్లే!


### ఈ పద్ధతి వల్ల లాభాలు :

వ్యయం పరంగా చూస్తే, రెండు వేల రూపాయలు ఖర్చయినప్పటికీ, ఈ పద్ధతి వల్ల మనకెన్నో లాభాలున్నాయి. ఐరన్ ర్యాకుల్లో మనం పెంచే ఆకుకూరలను బట్టి, ర్యాకుల్లోని ప్లేట్ల ఎత్తును జరుపుకుని సరిచేసుకోవచ్చు. ఎక్కువ యూనిట్లు తయారు చేయగలిగితే, ఇంకా తక్కువ ధరలోనే మనకు అందుబాటులోకి వస్తాయి. ఈ పద్ధతి ద్వారా పెరట్లోనే, లేదా మిద్దెపైన ఈ ర్యాకుల్లో ఆకుకూరలను సాగుచేసుకోవచ్చు. డ్వాక్రా మహిళా సంఘాలు ఈ పద్ధతిని అమలుచేసి, గ్రామాల్లో మంచి ఆదాయం పొందే అవకాశం ఎంతైనా వుంది. ఐరన్‌ర్యాక్ ప్లేట్లకు రెడాక్సైడ్ పెయింట్ వేయడం వల్ల, ఒక యూనిట్ కనీసం మూడు సంవత్సరాల పాటు ఇబ్బంది లేకుండా పనిచేస్తుంది. యూనిట్‌పై పెట్టిన పెట్టుబడిని కేవలం ఒక సంవత్సరంలోనే తిరిగి పొందవచ్చు కూడా. ఇకపోతే, తక్కువ ఉష్ణోగ్రతలో ఈ యూనిట్‌ను వుంచి బ్రొకోలి మొక్కలను కూడా పెంచవచ్చు. బ్రొకోలి సర్వ రోగ నివారిణి. కిలో బ్రొకోలి సుమారు 250 రూపాయల దాకా వుంటుంది. హర్యానాలో ఈ బ్రొకోలిని బాగా పండిస్తున్నారు. పండ్లు, కూరగాయలతో పోలిస్తే బ్రొకోలి మొలకలు పదింతలు ఎంజైమ్స్ కలిగి వుంటాయి. బ్రొకోలి మొలకల్లో సల్ఫోరాఫేన్ కాంపౌండ్ వుండడం వల్ల, ఇది క్యాన్సర్‌కు విరుగుడుగా కూడా ఉపయోగపడుతుందని వైద్య నిపుణులు పేర్కొంటున్నారు.

### కలుపు లేకుండా మొక్కలు పెంచే విధానం :

ఇదిలావుంటే, కలుపు లేకుండా మొక్కలు పెంచే విధానం కూడా డాక్టర్ జగదీష్ కనుగొన్నారు. మామూలుగా తొట్టెల్లో పెంచే మొక్కల చుట్టూ కలుపు పెరుగుతుంది. కలుపు లేకుండా మొక్క ఎక్కువగా పెరిగేందుకు, నీరు తక్కువగా ఆవిరి చెందేందుకు సులభమైన పద్ధతిని ఆయన రూపొందించారు. తొట్టెలో మట్టి పోసి, నల్లటి పాలిథిన్, లేకపోతే పల్చని నల్లని కాన్వాస్‌ను తాడుతో చుట్టాలి. మధ్యలో మూడంగుళాల గుండ్రని రంధ్రం చేసి, కావాల్సిన కాయగూర విత్తనాలను (బెండ, టమోటో, చిక్కుడు వగైరాలు) వేయాలి. విడిగా నారును పెంచితే, చిన్నమొక్కలను ఈ రంధ్రం మధ్యలో నాటాలి. ఈ పద్ధతి వల్ల అధిక దిగుబడి రావడమే కాక, అందించిన నీరు, ఎరువును మొక్కకు బాగా అందుతాయి. ఈ పద్ధతిలో కేవలం నల్లటి కాన్వాస్, లేక పాలిథిన్ కవరు మాత్రమే ఖర్చవుతుందని ఆయన వివరించారు.






Edited, Published, Printed & Owned by **THUNGA SIVAPRABHATH REDDY**, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Printed & Published at **Roopa Graphics**, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Ph:2323485. Editor-**THUNGA SIVAPRABHATH REDDY,** Executive Editor-**G.SREENIVASULU REDDY**. e-mail: roopagroup@yahoo.com